# కాళేశ్వరం ప్రాజెక్టు ఇంజనీరింగ్ అద్భుతమేనా??

కాళేశ్వరం ఎత్తిపోతల సాగునీటి ప్రాజెక్టు (కాళేశ్వరం లిఫ్ట్ ఇర్రిగేషన్ ప్రాజెక్టు, కెయల్ఐపి) తీసుకురావడంలో తెలంగాణ ప్రభుత్వం తొందరపడిందని, దాని ప్రయోజనం కన్న ఆర్థిక భారమే రాష్ట్రానికి మోయలేని బరువు అవుతుందని, ఇటీవల వరదల్లో ప్రాజెక్టు పంపులు మునిగిన నేపథ్యంలో లక్షల కోట్ల ధనాన్ని నీటిలో పోసినట్లు అయ్యిందని విమర్శలు వినడం సర్వసాధారణం అయ్యింది. గతంలో ప్రాజెక్టు పూర్తి చేసి నీటిని ఎత్తి పోస్తూ గ్రామగ్రామాన చెరువులు కుంటలు నింపడంతో ప్రజలు, నిపుణులు ఇలాంటి కాళేశ్వరం ప్రాజెక్టును అద్భుతమైందని, ప్రపంచంలోనే ఒక విలక్షణ ప్రాజెక్టు అని కొనియాడడం, ప్రాజెక్టును దర్శించి ఆశ్చర్యానికి, ఆనందానికి గురికావడం చూసాం. పలు ప్రభుత్వ సంస్థలు అనుమతులు ఇవ్వడంతో పాటు ప్రశంసించడమే కాకుండా ప్రభుత్వరంగ ఆర్థిక సంస్థలు కోట్ల రూపాయల రుణాలను ఇవ్వడం జరిగిన నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వాన్ని ఏకాకిని చేసి విఫల ప్రాజెక్టును రూపొందించిందంటూ ముప్పేట దాడి చేయడం సమంజసంగా కనిపించుట లేదు. ప్రాజెక్టు నిర్మాణానికి చేసిన అప్పులకు ఏడాదికి 8.25 నుంచి 10.9 శాతం వరకు భారీ వడ్డీలను చెల్లించాల్సి వస్తున్నదని వాపోవడం సమంజసంగానే కనిపిస్తున్నది. డిపిఆర్ (డీటేయిల్లేడ్ ప్రాజెక్టు రిపోర్ట్) లేకుండా, నిపుణుల సలహాలను పెడచెవిన పెట్టి కాళేశ్వరం ప్రాజెక్టును కట్టారని, నీటిని పలు దశల్లో ఎత్తి పోయడానికి విద్యుత్తు ఖర్చులు భారీగా ఉంటాయని, దీర్ఘకాలికంగా దీని నీటిని సాగుకు వినియోగించడం ఆర్థికంగా సాధ్యపడక పోవచ్చనే మాటలు వింటున్నాం. తొలి దశలో 40 వేల కోట్ల అంచనాతో ప్రారంభమైన ప్రాజెక్టు వ్యయం 1.4 లక్షల కోట్లకు ఎగబాకిందని వింటున్నాం. ఇటీవల కేంద్ర మంత్రులు మాట్లాడుతూ ఈ ప్రాజెక్టుకు చట్టపరమైన అనుమతులు లేవని, ప్రాజెక్టు డిజైన్‌లో నిపుణుల సలహాలు తీసుకోలేదని, దీనిలోని లోపాల మూలంగా ఇటీవలి భారీ వర్షాలకు మునిగి పోయిందని విమర్శించడం మనకు ఇంకా గుర్తుంది.

## కాళేశ్వరం ప్రాజెక్టు అందుకున్న ప్రశంసలు:

ప్రారంభం నుండి పలు వివాదాలను ఎదుర్కొంటున్న కాళేశ్వరం ప్రాజెక్టు కట్టడానికి వెచ్చించిన భారీ పెట్టుబడులకు, పరిమిత ప్రయోజనాలకు మధ్య అనంత అంతరం ఉందనే మాటలను వింటున్నాం. 2014కు పూర్వం నాటి కాంగ్రేస్ ప్రభుత్వం తీసుకువచ్చిన 'ప్రాణహిత చేవెళ్ళ ఎత్తిపోతల ప్రాజెక్టు' ప్రణాళికలు మార్చి నేటి టిఆర్‌యస్ ప్రభుత్వం కాళేశ్వరం ఎత్తిపోతల ప్రాజెక్టు పథక రచన చేసి అతి తక్కువ కాలంలో అత్యధిక పెట్టుబడులతో దాదాపు పూర్తి చేసింది. నేటి ప్రభుత్వం ఈ ప్రాజెక్టు నిర్మాణానికి రుణాలు తీసుకోవడానికి "కాళేశ్వరం సాగు నీటి ప్రాజెక్టు కార్పొరేషన్" ఏర్పాటు చేయడంతో ఈ రుణాలు రాష్ట్ర ప్రభుత్వ బడ్జెట్ పరిధిలోకి రాకుండా జాగ్రత్త పడింది. ఈ ప్రాజెక్టు నిర్మాణాన్ని ప్రశంసిస్తూ "డిస్కరీ చాలెన్"లో కూడా డాక్యుమెంటరీ ప్రసారం కావడం చూసాం. ప్రాజెక్టు దర్శనానికి నిపుణులు, ఉన్నతాధికారులు, పౌర సమాజం క్యూ కట్టడం, మెచ్చుకోవడం గత చరిత్రగా మిగిలిపోయింది. ఒక దశ ప్రాజెక్టు ప్రారంభోత్సవానికి నాటి గవర్నర్ నరసింహన్‌తో పాటు మహారాష్ట్ర బిజేపి ముఖ్యమంత్రి కూడా హాజరై ప్రశంసించడం జరిగింది. "సెంట్రల్ వాటర్ కమిషన్"(సిడబ్ల్యుసి)కు చెందిన ఉన్నతాధికారులు జనవరి 2018లో ఈ ప్రాజెక్టును దర్శించి ఇదో మానవ నిర్మిత ప్రత్యేక ప్రాజెక్టు అంటూనే 'ఇంజనీరింగ్ అద్భుతం (ఇంజనీరింగ్ మార్వెల్)' అని ప్రశంసించడం విన్నాం. సిడబ్ల్యుసి శాఖ ద్వారా ప్రాజెక్టుకు సంబంధించిన 9 అనుమతులు కూడా ఇవ్వడం జరిగింది. ఆర్థిక సంస్థ నాబార్డ్ అధికారులు కూడా ప్రాజెక్టును చూసి ఈ ప్రాంత రైతులకు వరప్రదాయని అవుతుందంటూని, తెలంగాణ ప్రాంతం కోనసీమలా మారిందని ప్రశంసించారు.

## సేకరించిన రుణాలు – భారీ వడ్డీ రేట్లు:

కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణానికి 15 దశల్లో 6 ఆర్థిక సంస్థలు రూ: 97,449.16 కోట్ల రుణాలు అందజేశాయని సమాచార హక్కు చట్టం ప్రయోగించి సేకరించిన వివరాలు తెలుపుతున్నాయి. వీటిలో పంజాబ్ నేషనల్ బ్యాంక్ నుంచి రూ: 11,400 కోట్లు, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నుంచి రూ: 7,400 కోట్లు, బ్యాంక్ ఆఫ్ బరోడా నుంచి రూ: 2,150 కోట్లు, రూరల్ ఎలక్ట్రిసిటీ కార్పొరేషన్ నుంచి రూ: 30,536 కోట్లు, పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ నుంచి రూ: 37,737 కోట్లు, నాబార్డ్ నుంచి రూ: 8,225 కోట్లు రుణాలుగా తీసుకోవడం జరిగింది. ప్రాజెక్టు వ్యయంలో 90 శాతం పబ్లిక్ సెక్టార్ బ్యాంకులు కల్పించడం విశేషంగా గమనించాలి. ఈ రుణాలకు సాలీనా 8.25 – 10.9 శాతం వడ్డీలను చెల్లించాల్సి ఉంటున్నది. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రాజెక్టు నిర్మాణానికి తీసుకున్న రుణానికి భారీ వడ్డీలను సాలీనా చెల్లించాల్సి ఉంటుందని గమనించాలి. ఈ రుణాలకు వడ్డీల రూపంలో ప్రతి ఏట రూ: 13,000 కోట్లను రాబోయే 13 ఏండ్ల పాటు తెలంగాణ ప్రభుత్వం చెల్లించాల్సి ఉంటుందని, మె?త్తంగా రూ: 71,575 కోట్లను వడ్డీలుగా మాత్రమే చెల్లిస్తూ, రుణ విముక్తం కావడానికి మె?త్తంగా రూ: 1,69,023 కోట్లను తెలంగాణ చెల్లించడానికి సిద్ధంగా ఉండాలని అంటున్నారు. ప్రాజెక్టు నుంచి నీళ్లు తోడకపోయినా ఈ రుణాలు చెల్లించడం తప్పనిసరి కానుందని, ప్రాజెక్టును వినియోగిస్తే వచ్చే విద్యుత్తు ఖర్చులు, మెయింటెనెన్స్ భారం కూడా భారీగానే పడుతుందని గమనించాలి.

## ప్రాజెక్టు వినియోగ ఖర్చులు:

కాళేశ్వరం ఎత్తిపోతల సాగునీటి ప్రాజెక్టు ద్వారా నీటిని ఎత్తి పోయడానికి 13,558 మిలియన్ యూనిట్ల విద్యుత్తు అవసరమని, విద్యుత్తు బిల్లుల చెల్లింపులకు 10,000 – 14,000 కోట్ల ఖర్చు సాలీనా అవుతుందని అంచనా వేస్తున్నారు. ప్రాజెక్టు రిపోర్ట్ ప్రకారం 18.2 లక్షల ఎకరాలకు సాగు నీరు అందుతుందని అంచనా వేసారు. సాధారణంగా ఒక టియంసీ నీటితో 6,000 ఎకరాల వరికి సాగు నీరు అందుతుందని, 10,000 ఎకరాల ఇతర ఆరుతడి పంటలకు నీరు అందుతుందని గణాంకాలు తెలుపుతున్నాయి. ఈ లెక్కల ప్రకారం 144 టియంసీల నీటితో 10 లక్షల ఎకరాలకు వరి/ఇతర పంట పొలాలకు మాత్రమే సాగు నీరు అందుతుందని నిపుణులు అంచనా వేస్తున్నారు. ఈ గణాంకాల ప్రకారం ప్రతి ఎకరా సాగుకు రూ: 2.5 లక్షల ఖర్చు అవుతుందని అంచనా. ఒకవేళ 18.2 లక్షల ఎకరాలకు నీటిని అందిస్తే ప్రతి ఎకరాకు రూ: 1.37 లక్షల ఖర్చు అవుతుందని, విద్యుత్తుకు మాత్రమే ఎకరాకు రూ: 55,000 ఖర్చు వస్తుందని గమనించాలి.

## రాష్ట్రానికి గుదిబండలా మారనుందా??

కేంద్ర ప్రభుత్వ సంస్థల కొన్ని అనుమతులు, ప్రభుత్వరంగ బ్యాంకులు రుణాలను పొందిన కాళేశ్వరం ప్రాజెక్టు ప్రపంచంలోనే 'అతి పెద్ద పెట్టుబడులతో నిర్మించిన సాగు నీటి ప్రాజెక్టు'గా చరిత్రలో నిలుస్తున్నది. కాళేశ్వరం ప్రాజెక్టును వినియోగంలోకి తేవడానికి సాలీనా ప్రభుత్వానికి రూ: 25,000 కోట్ల ధనం అవసరం అవుతుంది. కేంద్ర జల మండలి అనుమతులు, ప్రభుత్వరంగ బ్యాంకుల రుణాలు లేకుండా ఈ ప్రాజెక్టు వచ్చేది కాదు. తెలంగాణ ప్రభుత్వం ఈ ప్రాజెక్టును రహస్యంగా నిర్మించలేదు. ప్రాజెక్టు డిజైన్ దశలో సాగునీటి ప్రాజెక్టులకు సంబంధించిన ఇంజనీరింగ్ నిపుణుల సలహాలు, సూచనలు తీసుకోలేదనే విమర్శలు నిజమైతే అది ప్రభుత్వ వైఫల్యంగా మాత్రమే భావించాలి. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం భారీ ఆర్థిక పతనమని, ప్రమాదకర సాంకేతిక లోపమని విమర్శించడం వింటున్నాం. భారీ రుణాలను పొందిన ప్రభుత్వ సంస్థ 'కాళేశ్వరం ఇర్రిగేషన్ ప్రాజెక్టు కార్పొరేషన్' రుణాలను చెల్లించడంలో విఫలమై దివాలా తీసే స్థాయికి చేరితే తెలంగాణ రాష్ట్రం, రాష్ట్ర ప్రభుత్వం, రుణాలు ఇచ్చిన బ్యాంకులే బాధ్యత తీసుకోవలసి ఉంటుంది. ఏది ఏమైనా ప్రపంచ ఇర్రిగేషన్ ప్రాజెక్టుల చరిత్రలో కాళేశ్వరం ప్రాజెక్టు ఓ 'ఇంజనీరింగ్ మార్వెల్' అని కొనియాడబడుతుంది. ఇలాంటి భారీ ప్రాజెక్టుల రూపకల్పనలో శాస్త్ర సాంకేతిక నిపుణుల లోతైన సలహాలను తీసుకుంటూ రాష్ట్ర ఖజానాపై అధిక భారం పడకుండా చూడాల్సిన బాధ్యత మన ప్రభుత్వాలు, పాలకులు తీసుకొని ఉండాల్సింది. ప్రపంచ దృష్టిని ఆకర్షించిన కాళేశ్వరం ప్రాజెక్టు తెలంగాణ రైతుల వరప్రదాయినిగా మారుతూ, తెలంగాణకు "రైస్ బౌల్ ఆఫ్ ఇండియా"గా పేరు తేవాలని కోరుకుందాం.



– డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి
99497 00037

## "మనిషి - యంత్రం చర్చ" అనే అంశంపై - అంతర్జాతీయ సమావేశం

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 23: కేంద్ర ఆయుష్ మంత్రి శ్రీ సర్బానంద సోనోవాల్ ఈ రోజు బెంగళూరులోని నిమ్హాన్స్ లో "స్పృహను అన్వేషించడం – స్థానికేతరత్వం నుండి – ద్వంద్వత్వం లేకపోవడం వరకు: మనిషి – యంత్రం చర్చ" అనే ఇతివృత్తంతో స్పృహ పై అంతర్జాతీయ సదస్సు ను ప్రారంభించారు. ఆయుష్ మంత్రిత్వ శాఖ సహకారంతో, ఈ సదస్సును ఇండియా ఫౌండేషన్ మరియు నిమ్హాన్స్ సంస్థలు నిర్వహించాయి.

ఈ సందర్భంగా శ్రీ సర్బానంద సోనోవాల్ మాట్లాడుతూ, "భారతదేశం ఆయుర్వేదం మరియు యోగా శాస్త్రాలు గా అభివృద్ధి చెందిన ప్రకృతి మరియు జీవిత అధ్యయనానికి దగ్గరి సంబంధం ఉన్న ఆధ్యాత్మిక విచారణ సంప్రదాయాన్ని కలిగి ఉంది. వ్యక్తి మరియు సామాజిక స్థాయిలో మనస్సు మరియు శరీరంలో ఆరోగ్యం మరియు శ్రేయస్సును పొందడం మరియు నిర్వహించడం కోసం అన్వేషణకు సంబంధించి, స్పృహ అధ్యయనాల రంగంలో మార్గదర్శక పరిశోధనలకు భారతదేశం అనువైన సమావేశ స్థలం." అని పేర్కొన్నారు.

ఈ సమావేశం భౌతికశాస్త్రం, జీవశాస్త్రం, నాడీశాస్త్రం, కృత్రిమ మేధస్సు, సైబర్–నెటిక్స్, క్వాంటం కంప్యూటింగ్ తో పాటు, అనుబంధ రంగాల్లోని ప్రముఖ పరిశోధకులు, ఆవిష్కర్తలతో పాటు, ప్రధాన భారతీయ ఆధ్యాత్మిక, మానసిక విభాగాలు, సిద్ధాంతాల పండితులు, ఆధ్యాత్మిక బోధకులను ఒక చోటుకు చేరుస్తుంది.

ఆయుష్ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని ప్రధాన కార్యక్రమం "ఆయుర్ స్వాస్థ్య యోజన" లో భాగంగా బెంగళూరులోని నిమ్హాన్స్ లోని సమగ్ర వైద్య విభాగంలో "సెంటర్–ఆఫ్–ఎక్సలెన్స్–ప్రాజెక్ట్" ను కూడా అంతకు ముందు కేంద్ర మంత్రి ప్రారంభించారు. విద్యలో సాంకేతికత, పరిశోధన, ఆవిష్కరణ తదితర అంశాలలో ఆయుష్ నిపుణుల సామర్థ్యాలను ఈ సెంటర్–ఆఫ్–ఎక్సలెన్స్ (సి.ఓ.ఈ) బలోపేతం చేస్తుంది.

సమీకృత యోగా, ఆయుర్వేద చికిత్సా విధానాల సమర్థత, భద్రత, ప్రతిపాదిత యంత్రాంగాన్ని స్థాపించడానికి నాలుగు న్యూరో–సైకియాట్రిక్ డిజార్డర్ లలో క్లినికల్ ట్రయల్స్ నిర్వహించడం మొదలైనవి, నిమ్హాన్స్ వద్ద సి.ఓ.ఈ. ప్రాజెక్టు యొక్క ప్రధాన లక్ష్యాలు. న్యూరోసైకియాట్రిక్–డిజార్డర్స్ ("దోషిక్–బ్రెయిన్") యొక్క ఇంటిగ్రేటివ్ న్యూరోబయాలజీని కూడా, ఇది అర్థం చేసుకుంటుంది. ఒక ఏకీకృత డిజిటల్ డేటా బేస్ ను రూపొందించి, సాంప్రదాయ, ఆధునిక శాస్త్రీయ విధానాల నుండి మెదడు–ఆరోగ్యాన్ని పరిశీలించడంలో సముచిత నైపుణ్యాలను కలిగి ఉన్న వైద్యుడు–శాస్త్రవేత్తలకు శిక్షణ ఇచ్చి, అభివృద్ధి చేస్తుంది.

## మరోసారి అస్వస్థతకు గురైన ఏపీ మంత్రి విశ్వరూప్

అమరావతి, సెప్టెంబర్ 23: ఏపీ రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ ఈరోజు మరోసారి తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. గుండె సంబంధిత సమస్యతో బాధపడుతున్న ఆయనకు ఈరోజు మరోసారి నొప్పి రావడంతో కుటుంబ సభ్యులు ఆయనను ముంబైకి తరలించారు. గతంలో రెండుసార్లు ఆయన ఇదే విధంగా బాధపడుతూ హైదరాబాద్ తదితర ప్రాంతాల్లో చికిత్సపొందారు. సెప్టెంబర్ 2న దివంగత సీఎం వైఎస్ఆర్ వర్ధంతి సందర్భంగా అమలాపురంలో జరిగిన కార్యక్రమానికి మంత్రి విశ్వరూప్ హాజరయ్యారు. పార్టీ శ్రేణులతో మాట్లాడుతున్న సమయంలోనే ఒక్కసారిగా ఛాతి నొప్పితో అస్వస్థతకు గురై కిందపడిపోయారు. ఆ తర్వాత మళ్లీ ఇప్పుడు మంత్రి అస్వస్థతకు గురయ్యారు.

## ఏపీలో జనవరి నుంచి పెన్షన్ రూ.2750లు .. సీఎం జగన్

అమరావతి, సెప్టెంబర్ 23:ఏపీలో జనవరి నెల నుంచి రూ.2500లు ఉన్న పెన్షన్ ను రూ.2750లకు పెంచుతున్నట్లు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి తెలిపారు. కుప్పం నియోజకవర్గంలో రూ.11కోట్లతో నిర్మించిన ప్రభుత్వ ఆఫీసుల కాంప్లెక్స్ ను ప్రారంభించారు. వైఎస్ఆర్ చేయూత నిధుల విడుదల సందర్భంగా నిర్వహించిన బహిరంగ సభలో సీఎం జగన్ మాట్లాడుతూ? రాష్ట్రంలో జనవరి నెల నుంచి పెన్షన్ రూ.2750లకు పెరుగుతుందన్నారు. ఇది మహిళల ప్రభుత్వమన్నారు. ప్రతి మహిళకు ఏటా రూ. 18,750లు ఇస్తున్నామన్నారు.

## సరసమైన ధరలకు, సులువుగా లభించేలా చూసేందుకు దేశవ్యాప్తంగా పోషణ్ వాటికలు

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 23: ఆయుష్ మంత్రిత్వ శాఖ తో కలిసి మహిళా, శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖ అమలు చేస్తున్న కార్యక్రమాల్లో భాగంగా 4.37 అంగన్వాడీ కేంద్రాల్లో పోషణ వాటికలు ఏర్పాటు చేసింది. ఇంతేకాకుండా గుర్తించిన ఆరు రాష్ట్రాల వివిధ ప్రాంతాల్లో 1.10 ఔషధ విలువలు గల మొక్కలను పంపిణీ చేసింది.

ప్రస్తుతం అమలు జరుగుతున్న పోషకాహార మాసంలో పెద్ద సంఖ్యలో పెరటి తోటలు/ చేపల పెంపకం కేంద్రాలు గల పోషకాహార తోటల లేదా రెట్రో–ఫిట్టింగ్ పోషణ వాటికలు నెలకొల్పడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి.

ఇంతవరకు దేశంలో 1.5 లక్షల పెరటి తోటలు/ చేపల పెంపకం కేంద్రాలు గల పోషకాహార తోటల లేదా రెట్రో–ఫిట్టింగ్ పోషణ వాటికలు ఏర్పాటు అయ్యాయి. చిరుధాన్యాల సాగు చేయడానికి ,మరియు పెరటి తోటలు ఏర్పాటు చేసే విధంగా ప్రజలను ప్రోత్సహించేందుకు 1.5 లక్షల అవగాహన కార్యక్రమాలు జరిగాయి. పోషకాహార మాసంలో భాగంగా పోషణ వాటికల నమూనాను ప్రతిబింబించే విధంగా 40 వేల అంగన్వాడీ కేంద్రాలను నిర్మించాలని నిర్ణయించడం జరిగింది. దీనికోసం ఇప్పటికే స్థల సేకరణ పూర్తయింది.

2018 లో ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ పోషన్ అభియాన్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. పిల్లలు, యుక్త వయస్కులు, గర్భిణీ స్త్రీలు, పాలిచ్చే తల్లులకు పోషక విలువలు గల ఆహారాన్ని అందించాలనే లక్ష్యంతో కార్యక్రమాన్ని ప్రారంభించడం జరిగింది. పోషణ్ 2.0లో కీలకమైన అంశంగా అమలు జరుగుతున్న పోషన్ అభియాన్ కార్యక్రమంలో పిల్లలు, కౌమారదశలో ఉన్న బాలికలు, గర్భిణీ స్త్రీలు మరియు పాలిచ్చే తల్లులకు పోషకాహారం అందించి వ్యూహాత్మక మార్పు ద్వారా ఆరోగ్యం, ఆరోగ్యం మరియు రోగనిరోధక శక్తిని పెంపొందించే పద్ధతులను ప్రోత్సహిస్తుంది. పోషకాహార లోపం సవరించి సమగ్ర అభివృద్ధికి ప్రయత్నిస్తుంది.

పోషక విలువలు కలిగిన పండ్లు, కూరగాయలు, ఔషధ మొక్కలు మరియు మూలికలు సరసమైన ధరలకు అందరికీ అందుబాటులోకి తీసుకురావాలన్న లక్ష్యంతో పోషణ్ వాటికలు లేదా పోషకాహార తోటల అభివృద్ధి కార్యక్రమాన్ని ప్రారంభించడం జరిగింది. దేశవ్యాప్తంగా సులువుగా అమలు జరగడానికి అవకాశం ఉన్న ఈ కార్యక్రమం ద్వారా స్థానికంగా పోషక విలువలు కలిగిన పండ్లు, కూరగాయలు, ఔషధ మొక్కలు మరియు మూలికలు ఉత్పత్తి చేసి వాటిని మహిళలు, పిల్లలకు అందిస్తారు.

స్థానికంగా పండే పండ్లు మరియు కూరగాయల ద్వారా కీలకమైన సూక్ష్మ పోషకాలు అందించడం ద్వారా ఆహార వైవిధ్యాన్ని పెంపొందించడంలో పోషణ్ వాటికలు ముఖ్యమైన పాత్ర పోషిస్తాయి. పోషన్ వాటికలు క్షేత్ర స్థాయిలో అమలు జరిగే కార్యక్రమాలకు మంచి ఉదాహరణగా ఉంటాయి. స్థానిక ఉత్పత్తుల వినియోగం పెరుగుతుంది. ఇతర ప్రాంతాల నుంచి వస్తువులను తీసుకు రావలసి ఉండదు. దీనితో స్థానిక ప్రజలు స్వావలంబన సాధించి పోషకాహార భద్రత పొందుతారు.

## లోన్ యాప్ లో డబ్బులు తీసుకుని జీవితాలు నాశనం చేసుకోవద్దు.. ఎస్పీ పరమేశ్వరరెడ్డి



తిరుపతి, సెప్టెంబర్ 23: లోన్ యాప్ ల ద్వారా డబ్బులు తీసుకుని జీవితాలను నాశనం చేసుకోవద్దని జిల్లా ఎస్పీ.పరమేశ్వర్ రెడ్డి తెలిపారు. శుక్రవారం ఎస్పీ కార్యాలయం నందు లోన్ యాప్ లపై డబ్బులు తీసుకుని లోన్ యాప్ ల ద్వారా వేధింపులకు గురవుతూ ఉంటే.. పోలీసులకు సమాచారం అందించాలని తెలియ జేస్తూ విస్తృతంగా ప్రచారం చేసేందుకు పోస్టర్ విడుదలతో పాటు ఆటోలపై స్టిక్కర్లను అంటించి ప్రచార కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు.. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఎవరైనా లోన్ యాప్ ద్వారా బాధింప పడుతూ ఉంటే ఆలస్యం చేయకుండా పోలీస్ లకు సమాచారం అందించాలని కోరారు. ఆన్ లైన్ లో న్ యాప్ ద్వారా ఎప్పుడైతే ఫోన్ నుండి లాగిన్ అవుతారని, అప్పటినుండి వారి లోన్ యాప్ మోసగాళ్లు చేతిలో ఉన్నట్లే అన్నారు.

నకిలీ లోన్ యాప్ లో లోన్ ఇచ్చేవారు కనబరిచిన వెబ్ సైటు, అడ్రస్సు, కాంటాక్ట్ డీటెయిల్స్, ఏ ఇతర వివరాలు అన్ని నిజమైనవి కావన్నారు. తీసుకున్న లోన్ అమౌంట్ మొత్తం వడ్డీతో సహా చెల్లించిన కూడా ఆగకుండా ఫోటోలను అశ్లీలంగా మార్ఫింగ్ చేసి మొబైల్ ఫోన్లో కాంటాక్ట్ లిస్టులో ఉన్న వారికి పంపి మరలా మరలా డబ్బులు పంపాలని వేధిస్తూ ఉంటారన్నారు.. అదేవిధంగా ఒక నకిలీ లోన్ యాప్ లో లోన్ తీసుకున్న వారు ఇప్పుడు డబ్బులు లేదు ఇబ్బందిగా ఉంది అంటే నకిలీ లోన్ యాప్ వారే సర్వ తీసుకుని ఇంకో నకిలీ లోన్ యాప్ ద్వారా లోన్ మంజూరు చేయించి మొదటి లోన్ యాప్ కి పంపించుకుంటారని తెలియజేశారు.. ఈ నకిలీ లోన్ యాప్ ల వేధింపులు బారిన పడి చాలామంది ఒత్తిడికి లోనై పరువు ప్రతిష్ట కోసం ఆత్మహత్య చేసుకోకుండా సైబర్ క్రైమ్ పోలీస్ ని సంప్రదించాలని కోరారు.

ఎవరైనా లోన్ యాప్ ల ద్వారా రుణం పొంది తీసుకున్న మొత్తం తిరిగి చెల్లించిన పేమెంట్ కూడా రుణ యాప్ ప్రతినిధులు ఎవరైనా అసభ్యకరంగా మాట్లాడి వేధింపులకు పాల్పడుతుంటే తక్షణమే సమీప పోలీస్ స్టేషన్లో కానీ సైబర్ మిత్ర నెంబర్ కి కానీ డయల్ 100 కు సమాచారం అందించాలన్నారు.తిరుపతి జిల్లా పరిధిలో 11 నకిలీ లోన్ యాప్ లపై కేసు నమోదు చేయడంతో పాటు బాధితులు మొత్తం రూ.14.5 లక్షలు కోల్పోగా వాటికి సంబంధించిన అనుమానిత బ్యాంక్ అకౌంట్ లో సుమారు రూ.7.5 కోట్ల రూపాయల అమౌంట్. ఫ్రిజ్ చేసి బాధితులకు కోర్టు బ్యాంకుల ద్వారా పోగొట్టుకున్న అమౌంట్ ను బాధితులకు ఇప్పించే విధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. తిరుపతి నగరంలో లోన్ యాప్ లకు సంబంధించి 41 లోన్ యాప్ లింకులను ప్లే స్టోర్ నుండి తొలగించాలని కేంద్ర మంత్రిత్వ శాఖకు నివేదిక పంపించడం జరిగిందని పేర్కొన్నారు. వాటిని వెంటనే లోన్ యాప్ లింక్ లను ప్లే స్టోర్ నుంచి తొలగించాలని కోరామని పేర్కొన్నారు.. ఇటీవల కాలంలో లోన్ యాప్ బాధ్యులతో పాటు ఇతర సైబర్ క్రైమ్ నేరాలు బాధితులు ఎక్కువవుతున్నారన్నారు. ప్రత్యేకించి లోన్ యాప్ బాధితులు ఆత్మహత్యలకు పాల్పడడం కూడా చూనస్తూ ఉన్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఆదరపు ఎస్పి అడ్మిన్ సుప్రజ, క్రైమ్ ఆదనపు ఎస్పీ విమల కుమారి, ట్రాఫిక్ డిఎస్పి వన్ కాటమరాజు, వెస్ట్ డిఎస్పి నర్సప్ప, ఎస్సీ ఎస్టీ సెల్.. నాగ సుబ్బన్న, సైబర్ క్రైమ్ సిఐ విక్రమ్ పాల్గొన్నారు.

## యూనివర్సిటీ పేరు మార్పుపై జగన్‌ను నిలదీయండి : పురంధరీశ్వరి

అమరావతి, సెప్టెంబర్ 23: ఆంధ్రప్రదేశ్‌లో అరాచక ప్రభుత్వం నడుస్తోందని, రాష్ట్రం దోపిడి వ్యవస్థలా మారిందని కేంద్ర మాజీ మంత్రి, బీజేపీ నాయకురాలు పురంధరీశ్వరి అన్నారు. విజయవాడలోని ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీకి పేరు ఎందుకు మార్చారో జగన్‌ను ప్రశ్నించాలని కార్యకర్తలకు,ఎన్టీఆర్ అభిమానులకు పిలుపునిచ్చారు. యూనివర్సిటీ పేరు మార్చడం ద్వారా ప్రయోజనం ఏమిటని అన్నారు.

శ్రీకాకుళం జిల్లా లావేరు మండలం బెజ్జిపురంలో నిర్వహించిన బీజేపీ ప్రజాపోరు కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. వైఎస్ జగన్ మూడేండ్ల పాలనలో రాష్ట్రం అధోగతి పాలైందని విమర్శించారు. ఎన్నికలకు ముందు రివర్స్ టెండర్ చేస్తానని, రాష్ట్రానికి డబ్బులు ఆదాచేస్తానని చెప్పి రాష్ట్ర అప్పును ఎనిమిది లక్షల కోట్లకు పెంచారని ఆరోపించారు. ప్రభుత్వ అవలంభిస్తున్న విధానాల వల్ల రాష్ట్రానికి ఒక్క పరిశ్రమ వచ్చే పరిస్థితి లేదన్నారు. శాంతి భద్రతల పరిస్థితి అదుపులో లేకుండా పోయిందని విమర్శించారు.

## సైనిక నర్సింగ్ సర్వీస్ దళాలు వారి కుటుంబాలకు ఆదర్శప్రాయమైన సేవను అందిస్తుంది

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 23: మిలిటరీ నర్సింగ్ సర్వీస్ భారతదేశంలోని శాంతి ఫీల్డ్ స్టేషన్లలో ఉన్న ఆసుపత్రులతో పాటు విదేశాలలో ఉన్న ఐక్యరాజ్యసమితి శాంతి పరిరక్షణ మిషన్లలో సైనికులకు వారి కుటుంబాలకు ఆదర్శప్రాయమైన సేవలను అందజేస్తోందని ఆర్మీ హాస్పిటల్ (ఆర్ఆర్) కమాండెంట్ లెఫ్టినెంట్ జనరల్ అశోక్ జిందాల్ ఈరోజు అన్నారు. ఢిల్లీలో జరిగిన కమిషనింగ్ వేడుకలో కాలేజ్ ఆఫ్ నర్సింగ్, ఆర్మీ హాస్పిటల్ (ఆర్‌డఆర్) ఐదవ బ్యాచ్ నర్సింగ్ గ్రాడ్యుయేట్లు పాల్గొన్నారు. ఈ వేడుకకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువ లెఫ్టినెంట్లను నర్సింగ్ విద్య గౌరవం నైతికతలను నిలబెట్టాలని అభివృద్ధి చెందుతున్న వైద్య సాంకేతికతలకు అనుగుణంగా ఉండాలని ఉద్బోధించారు. మిలటరీ నర్సింగ్ సర్వీస్ అడిషనల్ డైరెక్టర్ జనరల్ మేజర్ జనరల్ స్మితా దేవ్రాణి కొత్తగా నియమితులైన నర్సింగ్ అధికారులతో ప్రమాణం చేయించారు. ప్రతిభ కనబర్చిన నర్సింగ్ గ్రాడ్యుయేట్‌లను ముఖ్యఅతిథి సత్కరించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ ప్రముఖులు, నూతనంగా బాధ్యతలు స్వీకరించిన నర్సింగ్ అధికారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## నవంబర్ 1 నుంచి ప్లాస్టిక్ ఫ్లెక్సీలపై నిషేధం

అమరావతి, సెప్టెంబర్ 23: రాష్ట్రవ్యాప్తంగా ప్లాస్టిక్ ఫ్లెక్సీలపై నిషేధం అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా గురువారం నోటిఫికేషన్ విడుదల చేసింది. నవంబర్ 1వ తేదీ నుంచి నిషేధం అమల్లోకి రానుంది. ప్లాస్టిక్ ఫ్లెక్సీల వినియోగం, ముద్రణ, రవాణా, ప్రదర్శనలను అనుమతించరాదని అధికారులను ఆదేశించింది. సంబంధిత నగర, పట్టణాల్లో ని షేధాన్ని పటిష్టంగా అమలుచేయాలని మార్గదర్శకాలు జారీ చేసింది. గ్రామాల్లో ఫ్లెక్సీలు వినియోగించకుండా పర్యవేక్షించాలని ఆయా జిల్లా కలెక్టర్లకు సూచించింది. నిబంధనలను ఉల్లంఘిస్తే ఒక్కో ఫ్లెక్సీపై రూ. 100 జరిమానా విధించాలని స్పష్టం చేసింది. నిబంధనలను అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. పోలీసు, రవాణా, జీఎస్టీ అధికారులు తనిఖీలు నిర్వహించటంతో పాటు అతిక్రమించిన వారిపై కేసులు నమోదుచేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని నిషేధాన్ని పకడ్బందీగా అమలు చేయాలని ఉత్తర్వుల్లో వివరించింది.

ప్లాస్టిక్ ఫ్లెక్సీల ఉత్పత్తి, దిగుమతులకు కూడా ఈ ఉత్తర్వులు వర్తిస్తాయి. ప్లాస్టిక్ స్థానే కాటన్, నేత వస్త్రాలను వినియోగించాలని తేల్చిచెప్పింది. విశాఖపట్నం బీచ్‌లో వ్యర్థాలను వేరుచేసే కార్యక్రమానికి హాజరైన ముఖ్యమంత్రి జగన్ రాష్ట్రంలో ప్లాస్టిక్ వినియోగంపై త్వరలో నిషేధం విధిస్తామని ప్రకటించిన సంగతి విదితమే. కాగా సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగానికి సంబంధించి హైకోర్టులో విచారణ జరుగుతోంది. ఫ్లెక్సీలపై ఆధారపడి లక్షలాది మంది జీవిస్తున్నందున సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌కు అనుమతించాలంటూ పలువురు వ్యాపారులు కోర్టును ఆశ్రయించారు.

## గంజాయి విక్రయిస్తే కఠిన చర్యలు- పెద్దపల్లి ఏసీపీ సారంగపాణి

కరీంనగర్, సెప్టెంబర్ 23ఫప్రాణాంతకమైన గంజాయిని విక్రయించినా, రవాణా చేసినా కఠిన చర్యలు తప్పవని పెద్దపల్లి ఏసీపీ సారంగపాణి హెచ్చరించారు. శుక్రవారం పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని పాన్ షాపుల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ? పాన్ షాపుల్లో గంజాయి విక్రయిస్తున్నారని సమాచారం మేరకు తనిఖీలు నిర్వహించామన్నారు. ఇకపై తరచూ తనిఖీలు నిర్వహిస్తామని, నిషేధిత ఉత్పత్తుల అమ్మకాలు చేపడితే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామన్నారు. గంజాయి వాడకం వల్ల యువత బంగారు భవిష్యత్తు బుగ్గిపాలవుతుందన్నారు. ప్రజలు ఎవరైనా గంజాయి విక్రయించినా, రవాణా చేసినా పోలీసులకు సమాచారం అందించాలన్నారు. తనిఖీల్లో పెద్దపల్లి సిఐ ప్రదీప్ కుమార్, ఎస్ఐ రాజేష్ తో పాటు సిబ్బంది పాల్గొన్నారు.



# అక్కినేని నాగేశ్వరరావు జయంతి వేడుకల్లో పాల్గొననున్న ఎన్వీ రమణ



హైదరాబాద్, సెప్టెంబర్ 23: జస్టిస్ ఎన్వీరమణ ఇటీవలే ప్రధాన న్యాయమూర్తిగా పదవీ విరమణ చేశారు. కాగా ఆయన రిటైర్ అయిన తర్వాత ఆయన తొలిసారి హైదరాబాద్ కు వచ్చారు. ఢిల్లీ నుంచి శంషాబాద్ విమానాశ్రయానికి చేరుకున్న జస్టిస్ ఎన్వీ రమణ దంపతులకు ఎయిర్ పోర్టులో ఘన స్వాగతం లభించింది. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఉజ్జల్ భూయాన్, హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ కన్నెగంటి లలిత, జస్టిస్ నాగార్జున, జస్టిస్ బి.శరత్, జస్టిస్ సాంబశివరావు, జస్టిస్ చిన్నకూరి సుమలత, జస్టిస్ సీవీ భాస్కర్ రెడ్డి, జస్టిస్ వేణుగోపాల్, జస్టిస్ ఎన్ సుధీర్ కుమార్, జస్టిస్ పుల్ల కార్తీక్, జస్టిస్ లక్ష్మణ్ లతో పాటు టీఆర్ఎస్ ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ, పలువురు ప్రజాప్రతినిధులు, బంధుమిత్రులు స్వాగతం పలికారు. అక్కినేని నాగేశ్వరరావు 99వ జయంతి కార్యక్రమానికి జస్టిస్ ఎన్వీ రమణ హాజరవుతారు. ఈరోజు సాయంత్రం తెలుగు విశ్వవిద్యాలయంలో ఈ కార్యక్రమం జరగనుంది. ఈ సందర్భంగా 'రసమయి ? డాక్టర్ అక్కినేని లైఫ్ టైమ్ అచీవ్ మెంట్ అవార్డ్'ను ఆయన స్వీకరించనున్నారు.

# త్వరితగతిన రైల్వే ట్రాక్ ప్రాజెక్టులను పూర్తి చేసేందుకు భారతీయ రైల్వే ప్రాధాన్యత

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 23: భారతీయ రైల్వేలు లాజిస్టిక్స్ యూనిట్ ధరను కనిష్ట స్థాయికి తగ్గించే ప్రయత్నంలో ఉంది. ఇటీవలి కాలంలో రైలు పట్టాలకు సంబంధించిన రైలు మౌలిక సదుపాయాల ప్రాజెక్టులకు పెద్దపీటవేశారు, ఫలితంగా ఒక సరళి స్పష్టంగా గోచరించింది. రైల్వే పట్టాల ప్రాజెక్టులు అంటే, కొత్త లైన్లు, గాజ్ మార్పిడి, బహుళ పట్టాలు (మల్టీ ట్రాకింగ్) (రెండింతలు/ మూడింతలు) పని గత ఏడాదితో పోలిస్తే ఏప్రిల్ - సెప్టెంబర్ (నేటివరకు) దాదాపు మూడు రెట్లు పురోగతిని సాధించింది.

ఈ ఆర్థిక సంవత్సరం 21 సెప్టెంబర్ 2022వరకు రైల్వేలు 1353 ట్రాక్ కిలోమీటర్ల (టికెఎం) పొడవైన కొత్త లైన్లను, గాజ్ బదలాయింపులు, బహుళ పట్టాల ప్రాజెక్టులను పూర్తి చేసింది. సెప్టెంబర్ మాసంలో మరొక 130 టికెఎంలు దీనికి చేరనున్నాయి. గత ఏడాది సంవత్సరంలో ఏ కాలంతో పోలిస్తే ప్రస్తుత మొత్తం గణాంకం మూడు రెట్లు ఎక్కువగా ఉంది. గత ఏడాది, 482 టికెంలను 30 సెప్టెంబర్ 2021 నాటికి పూర్తి చేశారు.

ఈ ఆర్థిక సంవత్సరంలో నేటి వరకు 42 టికెఎంల కొత్త లైను, 28 టికెఎంల గాజ్ మార్పిడి, 1283 బహుళ ట్రాకింగ్ పూర్తి అయింది. అయితే, గత ఆర్థిక సంవత్సరం (సెప్టెంబర్ 2021 వరకు) కేవలం 4 టికెఎంల గాజ్ బదలాయింపు, 478 టికెఎంల బహుళ ట్రాకింగ్‌ను సాధించారు. అయితే, ఈ కాలంలో నూతన లైన్లలో ఎటువంటి పురోగతిని సాధించలేదు.

ప్రారంభించిన ప్రధాన విభాగాలు:

డబ్లింగ్ / మల్టీ ట్రాకింగ్ : దౌండ్ - గుల్బర్గా (225 కిమీ)- ముంబై- చెన్నై గోల్డెన్ క్వాడ్రిలేటరల్ రూట్ ( స్వర్ణ చతుర్భుజ మార్గం), ఏపిలో విజయవాడ- గుడివాడ- భీమవరానికి సంబంధించిన (221 కిమీ). సికింద్రాబాద్ - మహబూబ్‌నగర్ డబ్లింగ్ (85 కిమీ)- తెలంగాణ.

గాజ్ మార్పిడి: బీహార్‌లో మాన్సి- సహర్స- పూనియా (169 కిమీలు) - రాజస్థాన్‌లో మార్లీ- బడీ సద్రి (82 కిమీలు).

నూతన లైను: తెలంగాణలో భద్రాచలం - సత్తుపల్లి (56 కిమీలు)

ఆర్థిక సంవత్సరం 2022-2023లో నూతన లైన్/ డబ్లింగ్ / గాజ్ మార్పిడికి కేటాయించిన కాపెక్స్ (మూలధన వ్యయం) రూ. 67000 కోట్లుగా (బిఇ) ఉంది. ఆగస్టు 2022 వరకు వాస్తవ వ్యయం రూ. 20075. కాగా, 2021-2022లో నూతన లైన్/ డబ్లింగ్ / గాజ్ మార్పిడికి కేటాయించిన మొత్తం మూలధన వ్యయం రూ. 45465 కోట్లు (బిఇ)గా ఉంది. అయితే, ఆగస్టు 2021 వరకు అయిన వాస్తవ ఖర్చులు రూ. 15,281 కోట్లు.

నూతన లైను/ డబ్లింగ్, గేజ్ మార్పిడిలో 2021-2022లో లక్షిత 2400 కిమీలకు బదులుగా 2904 కిమీలను సాధించారు. ఇది అత్యున్నత కమిషనింగ్ (డిఎఫ్‌సిని మినహాయించి), ప్రస్తుత సంవత్సరానికి లక్ష్యం 2500 కిమీలు.

రైలు ప్రాజెక్టుల సమర్థవంతమైన, వేగవంతమైన అమలుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలలో - 1) ప్రాధాన్యత కలిగిన ప్రాజెక్టులకు తగినంతగా నిధుల కేటాయింపు పెంపు 2) క్షేత్ర స్థాయిలో అధికారాన్ని వేరొకరికి అప్పగించడం 3) వివిధ స్థాయిల్లో ప్రాజెక్టు పురోగతిని సన్నిహితంగా సమీక్షించడం 4) త్వరితగతిన భూసేకరణ, అటవీ, వన్యప్రాణుల అనుమతుల కోసం, ప్రాజెక్టులకు సంబంధించిన ఇతర సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర ప్రభుత్వాలు, సంబంధిత అధికారులతో క్రమం తప్పకుండా చర్చ, సంప్రదింపులు జరపడం.

# 'మహారత్న' కంపెనీ హోదా పొందిన ఆర్ఈసీ

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 23: 'మహారత్న' సెంట్రల్ పబ్లిక్ సెక్టార్ ఎంటర్‌ప్రైజ్ హోదా ఆర్ఈసీ సంస్థకు ఇవ్వబడింది. దీని ద్వారా ఆర్ఈసీ సంస్థకు మరింత కార్యాచరణ మరియు ఆర్థిక స్వయంప్రతిపత్తి లభిస్తుంది. ఈ మేరకు ఆర్థిక మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్ విభాగం నిన్న ఉత్తర్వులు జారీ చేసింది. 1969లో ఏర్పాటు చేయబడ్డ ఈ సంస్థ, భారతదేశం అంతటా పవర్ సెక్టార్ ఫైనాన్సింగ్ మరియు అభివృద్ధిపై దృష్టి సారించే ఎన్‌బీఎఫ్‌సీ.

ఆర్ఇసికి 'మహారత్న' హోదా మంజూరు చేయడం వల్ల ఆర్థిక నిర్ణయాలు తీసుకునేటప్పుడు కంపెనీ బోర్డుకు మెరుగైన అధికారాలు లభిస్తాయి. 'మహారత్న' సీపీఎస్ఈ యొక్క బోర్డు ఆర్థిక జాయింట్ వెంచర్లు, పూర్తిగా-యాజమాన్య అనుబంధ సంస్థలను చేపట్టడానికి ఈక్విటీ పెట్టుబడులు పెట్టవచ్చు. భారతదేశం మరియు విదేశాలలో విలీనాలు మరియు కొనుగోళ్లను చేపట్టవచ్చు., సంబంధిత సీపీఎస్ఈ యొక్క నికర విలువలో 15%తో ఒక ప్రాజెక్ట్‌లో ?5,000 కోట్ల పరిమితికి లోబడి ఉంటుంది. సిబ్బంది, మానవ వనరుల నిర్వహణ మరియు శిక్షణకు సంబంధించిన పథకాలను కూడా బోర్డు రూపొందించి అమలు చేయగలదు. దీనితో, ఆర్ఈసీ టెక్నాలజీ జాయింట్ వెంచర్స్ లేదా ఇతర వ్యూహాత్మక పొత్తులలోకి కూడా ప్రవేశించవచ్చు.

ప్రపంచవ్యాప్త కోవిడ్-19 మహమ్మారి సమయంలో కూడా సంస్థ అనుకూలత, స్థితిస్థాపకత, స్థిరమైన పనితీరు కారణంగా ఆర్ఈసీ ఘనతను సాధించిందని ఆర్ఈసీ సీఎండీ శ్రీ వివేక్ కుమార్ దేవాంగన్ అన్నారు. "2022 ఆర్థిక సంవత్సరంలో, ఆర్ఈసీ దాని ఖర్చుతో కూడుకున్న వనరుల నిర్వహణ మరియు బలమైన ఆర్థిక విధానాల కారణంగా దాని అత్యధిక నికర లాభం ?10,046 కోట్లు మరియు ?50,986 కోట్ల నికర విలువను చేరుకుంది. డీడీయూజీజేవై, సౌభాగ్య వంటి భారత ప్రభుత్వ ప్రధాన పథకాల విజయంలో ఈ సంస్థ కీలక పాత్ర పోషించింది. దేశంలో గ్రామం మరియు గృహ విద్యుద్దీకరణను సాధించడంలో దోహదపడింది. ఆర్థిక ఉ కార్యాచరణ సమస్యలను తగ్గించడానికి పంపిణీ రంగాన్ని పునరుద్ధరించడానికి ఆర్ఈసీ ప్రస్తుతం పునరుద్ధరించబడిన పంపిణీ రంగ పథకం (ఆర్డీఎస్ఎస్) కోసం నోడల్ ఏజెన్సీ పాత్రను పోషిస్తోంది. కంపెనీపై విశ్వాసం ఉంచిన వాటాదారులందరికీ.. ముఖ్యంగా ఐదు దశాబ్దాలకు పైగా సంస్థ కార్యకలాపాలకు తిరుగులేని మద్దతును అందించిన ఉద్యోగులందరికీ ధన్యవాదాలు తెలిపారు. ఈ సాఫల్యాన్ని సాధించడంలో కీలకమైన మార్గదర్శకత్వం, మద్దతు ఉన్న విద్యుత్ మంత్రిత్వ శాఖకు మా హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు.

# తేనె ఉత్పాదనలో స్టార్టప్ కంపెనీల పాత్ర! వారణాసిలో జాతీయ చర్చాగోష్టి నిర్వహణ



న్యూఢిల్లీ, సెప్టెంబర్ 23: 'తేనె విలువల వ్యవస్థలో వ్యవసాయ సంబంధమైన స్టార్టప్ కంపెనీల పాత్ర' అనే అంశంపై వ్యవసాయ, రైతుల సంక్షేమ మంత్రిత్వ శాఖ పరిధిలోని నేషనల్ బీ బోర్డ్ (ఎన్.బి.బి.) ఈ రోజు వారణాసిలో జాతీయ స్థాయి చర్చాగోష్టిని నిర్వహించింది. ఉత్తరప్రదేశ్ రాష్ట్రం, వారణాసిలోని జాతీయ విత్తన పరిశోధన, శిక్షణా కేంద్రం (ఎన్.ఎస్.ఆర్.టి.సి.) సహకారంతో ఈ చర్చాగోష్టి జరిగింది. తేనెటీగల పెంపకందారులు, హనీ స్టార్టప్ సంస్థల ప్రతినిధులు, వ్యవసాయ ఉత్పత్తి దారుల సంఘాలు (ఎఫ్.పి.ఒ.లు), తేనెటీగల పెంపకం భాగస్వాములు, వివిధ మంత్రిత్వ శాఖలు/ప్రభుత్వ సంస్థలు/అధ్యయన సంస్థలు, రాష్ట్రాల ఉద్యానవన శాఖలు, రాష్ట్రాల వ్యవసాయ విశ్వవిద్యాలయాలు (ఎస్.ఎ.యు.లు)/ కేంద్రీయ వ్యవసాయ విశ్వవిద్యాలయాల (సి.ఎ.యు.ల) ప్రతినిధులు, సంబంధిత ఇతర అధికారులు ఈ చర్చాగోష్టిలో పాల్గొన్నారు

కంద్ర ఉద్యానవన శాఖ అదనపు కమిషనర్, ఎన్.బి.బి. ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ ఎన్.కె. పాట్లే ఈ చర్చాగోష్టిలో ప్రారంభోపన్యాసం చేస్తూ, తేనె విలువల వ్యవస్థలో వ్యవసాయ స్టార్టప్ కంపెనీల పాత్రను గురించి క్లుప్తంగా వివరించారు. తేనెటీగల పెంపకంలో నేషనల్ బీ కీపింగ్-హనీ మిషన్ (ఎన్.బి.హెచ్.ఎం.) నిర్వహించే పాత్రను గురించి ఆయన వివరించారు. ఈ విషయంలో తేనె ఉత్పాదనా స్టార్టప్ కంపెనీలు, ఎఫ్.పి.ఒ.లు నిర్వహించే పాత్ర గురించి కూడా ఆయన చెప్పారు. తేనె సేకరణ, నిల్వ, ప్రాసెసింగ్ ప్రక్రియ, బ్రాండింగ్ కేంద్రాలు వంటి మౌలిక సదుపాయాల కల్పనకు ఉద్దేశించిన ఎన్.బి.హెచ్.ఎం. పథకం అమలు గురించి ఆయన ప్రధానంగా ప్రస్తావించారు. ఈ ఏర్పాట్లతో దేశంలో తేనెటీగల పెంపకం సామర్థ్యం పెరుగుతుందన్నారు. ఎన్.బి.హెచ్.ఎం. పథకం కింద అందుబాటులో ఉన్న ఈ సదుపాయాలన్నింటినీ వినియోగించుకోవలసిందిగా, తేనె ఉత్పాదనా రంగంలోని స్టార్టప్ కంపెనీలను, వ్యవసాయ ఉత్పత్తిదార్ల సంఘాలను కోరారు. తేనె, తదితర ఉప ఉత్పత్తుల ద్వారా అదనపు ఆదాయం పొందేందుకు వీలుగా, తేనెటీగల పెంపకాన్ని శాస్త్రీయ పద్ధతిలో చేపట్టాలని సూచించారు.

వారణాసి ఎన్.ఎస్.ఆర్.టి.సి. ఆవరణలో ఉంటున్న ఐ.ఆర్.ఆర్.ఐ. దక్షిణాసియా ప్రాంతీయ కేంద్రం (ఐ.ఎస్.ఎ.ఆర్.సి.) డైరెక్టర్ డాక్టర్ సుధాంశు సింగ్ మాట్లాడుతూ, దేశంలో తేనెటీగల పెంపక సామర్థ్యాన్ని పూర్తిస్థాయిలో పెంచేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. తేనె ఉత్పాదనా స్టార్టప్ కంపెనీలకు, వ్యవసాయ ఉత్పత్తిదార్ల సంఘాలకు మద్దతు ఇచ్చేందుకు కూడా ప్రభుత్వం కట్టుబడి ఉందని చెప్పారు. భారతీయ వ్యవసాయ రంగం, తేనెటీగల పెంపకంలో పరిస్థితిని మరింత మెరుగుపరచాలంటే, చిన్నతరహా, మధ్యతరహా తేనెటీగల పెంపకందార్లపై ఎక్కువ దృష్టిని కేంద్రీకరించాల్సి ఉందని, భారతీయ వ్యవసాయ ఆర్థిక వ్యవస్థలో ఎక్కువ భాగాన్ని వారే ప్రభావితం చేస్తున్నారని ఆయన అన్నారు. తేనెటీగల పెంపకం, తేనె ఉత్పాదనలో కీలకంగా పనిచేస్తున్న వ్యవసాయ ఔత్సాహిక ఉత్పత్తిదార్లకు, స్టార్టప్ కంపెనీలకు ఎన్.బి.హెచ్.ఎం. సహాయపడుతూ వస్తోందని అన్నారు. వ్యవసాయాన్ని... అంటే కృషిని ఆత్మనిర్భర కృషిగా మార్చేందుకు ఎఫ్.పి.ఒ.ల ఏర్పాటు, ప్రోత్సాహం అనేవి తొలి అడుగులు కావాలని ఆయన అన్నారు. ఎన్.బి.హెచ్.ఎం. పథకం అమలుతో తేనెటీగల పెంపకంలో వ్యవస్థీకృత ప్రక్రియ మరింత బలోపేతం కాగలదని, తేనె ఉత్పాదనా స్టార్టప్ కంపెనీలు కూడా పటిష్టపడగలవని ఆయన అన్నారు.

కేంద్ర వ్యవసాయ రైతు సంక్షేమ శాఖ అదనపు కార్యదర్శి డాక్టర్ అభిలాక్ష్ లిఖీ ఈ సందర్భంగా మాట్లాడుతూ, దేశాన్ని పూర్తి స్వావలంబనతో ఆత్మనిర్భర భారత్‌గా మార్చాలన్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపుమేరకు వ్యవసాయ ప్రధానమైన స్టార్టప్ కంపెనీల, వ్యవసాయ ఉత్పత్తిదార్ల సంఘాల అభివృద్ధికోసం ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటోందన్నారు.

ఇందుకోసం ఎన్.బి.హెచ్.ఎం. పథకం కింద మద్దతు అందిస్తున్నదని, తేనెటీగల పెంపకాన్ని ఆకర్షణీయమైన ఉపాధి మార్గంగా మార్చుకునేలా ప్రభుత్వం తగిన ప్రేరణను అందిస్తున్నట్టు తెలిపారు. ఎన్.బి.హెచ్.ఎం. పథకం అమలుతో శాస్త్రీయ పద్ధతిలో తేనెటీగల పెంపకంలో నైపుణ్యాల నవీకరణకు, తేనెతో పాటుగా, మైనం, ప్రొపోలిస్, రాయల్ జెల్లీ, తేనెటీగల విషం వంటి ఉప ఉత్పాదనల ప్రాసెసింగ్ కోసం అధునాతన మౌలిక సదుపాయాల ఏర్పాటు చేసుకోవడానికి వీలవుతుందని ఆయన అన్నారు. క్వాలిటీ కంట్రోల్ లేబరేటరీల ద్వారా నాణ్యతా పెంపు ప్రక్రియకు, మెరుగైన సరఫరా వ్యవస్థ ఏర్పాటుకు కూడా ఎన్.బి.హెచ్.ఎం. పథకాన్ని అమలు చేస్తున్నట్టు చెప్పారు.

వారణాసిలోని ఎన్.ఎస్.ఆర్.టి.సి. సంస్థ డైరెక్టర్ డాక్టర్ ఎం.పి. యాదవ్ మాట్లాడుతూ, వ్యవసాయం, ఉద్యానవనం రంగాల్లో కొత్తగా ఆవిర్భవించే వ్యవసాయ స్టార్టప్ కంపెనీలు మరింత ముందుకు వచ్చేందుకు ఇలాంటి చర్చాగోష్టులు, అవగాహనా కార్యక్రమాలు ఎంతగానో ఉపయోగపడతాయని అన్నారు. తేనెటీగల పెంపకం వంటి రంగాల్లో అవి సిద్ధపడేందుకు అవకాశం ఏర్పడుతుందని అన్నారు. తేనెటీగల పెంపకంలో ప్రమేయం ఉన్న స్టార్టప్ కంపెనీలకు అన్ని విధాల మద్దతు అందిస్తామని చర్చాగోష్టిలో పాల్గొన్న వారికి ఆయన హామీ ఇచ్చారు.

జాతీయ వ్యవసాయ, విస్తరణా నిర్వహణా సంస్థ (మేనేజ్-ఎం.ఎ.ఎన్.ఎ.జి.ఇ.)కు చెందిన స్టార్టప్ కంపెనీలు, మహారాష్ట్రలోని అమరావతికి చెందిన ట్రైబ్ గ్రోన్ ఎంటర్‌ప్రైజ్; మధ్యప్రదేశ్ రాజధాని, భోపాల్‌కు చెందిన వనబంధు ఎన్.ఆర్.ఎం. (ఒ.పి.సి.) ప్రైవేట్ లిమిటెడ్; హర్యానాలోని రోహ్తక్‌కు చెందిన రఘుంటి బీ ప్రొడక్ట్స్; ఉత్తరప్రదేశ్‌లోని బారాబంకీకి చెందిన మధు మఖీ వాలా ప్రతినిధులు; జాతీయ వ్యవసాయ సహకార మార్కెటింగ్ సమాఖ్య (నాఫెడ్) అనుబంధించిన బ్రిజ్ హనీఫెడ్ ఎఫ్.పి.ఒ.ల తరపున సతీశ్ శర్మ; ఇన్నవేటివ్ బీ ఫార్మ్స్ ప్రైవేట్ లిమిటెడ్ తరపున రంజీత్ కుమార్ తదితరులు చర్చాగోష్టిలో తమ అభిప్రాయాలను, అనుభవాలను పంచుకున్నారు. దేశంలో మార్కెట్ అవుతున్న తమ ఉత్పాదనలను గురించి వారు వివరించారు. వివిధ భాగస్వామ్య వర్గాల వారు ఏర్పాటు చేసిన తేనెల విలువల వ్యవస్థ ప్రాముఖ్యతను గురించి వారు ప్రధానంగా ప్రస్తావించారు. తేనెటీగల పెంపకం, ముడి తేనె ఉత్పాదన, తేనెటీగలకు ఆహారం అందించడం వంటి రంగాలను ఈ స్టార్టప్ కంపెనీలు ప్రోత్సహిస్తూ వస్తున్నాయి.

# ఆడపడుచులకు కానుకగా బతుకమ్మ చీరెలు - మంత్రి కొప్పుల ఈశ్వర్




కరీంనగర్, సెప్టెంబర్ 23 (నేటినిజం ప్రతినిధి): తెలంగాణ ఆడపడుచులకు కానుకగా సీఎం కేసీఆర్ బతుకమ్మ చీరలను అందిస్తున్నారని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ పేర్కొన్నారు.. శుక్రవారం సద్దుల బతుకమ్మ పండుగను పురస్కరించుకొని పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ మండలంలోని పలు గ్రామాల్లో మంత్రి కొప్పుల ఈశ్వర్ బతుకమ్మ చీరల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు.

ఈసందర్భంగా మాట్లాడుతూ? సబ్బండ వర్ణాలు ఏకమై ఎన్నో త్యాగాలు, పోరాటాలు, బలిదానాలతో సాధించుకున్న తెలంగాణ రాష్ట్రంలో అన్ని వర్గాలకు సముచిత స్థానం కల్పించాలనే లక్ష్యంతో సీఎం కేసీఆర్ పాలన సాగిస్తున్నారన్నారు. పూలను కొలిచే సంస్కృతి, సాంప్రదాయం ఒక్క తెలంగాణలోనే ఉందని, ఇక్కడి ఆడపడుచులకు అతిపెద్ద పండుగ అయిన బతుకమ్మకు ప్రభుత్వం కానుకగా చీరలను అందిస్తుందన్నారు. సబ్బండ వర్ణాల సంక్షేమమే ధ్యేయంగా సీఎం కేసీఆర్ ముందుకు సాగుతున్నారన్నారు. ఈకార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ సంగీత సత్యనారాయణ, పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రఘువీర్‌సింగ్‌తోపాటు తెరాస ప్రజాప్రతినిధులు, నాయకులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రకృతిని ఆరాధించే గొప్ప పండుగ బతుకమ్మ : మంత్రి జగదీష్ రెడ్డి



సూర్యాపేట, సెప్టెంబర్ 23: శాంతి సామరస్యానికి, పరమత సహనానికి మహిళలు అందరూ కలిసి జరుపుకునే పండుగ బతుకమ్మ. ఈ పండుగ ద్వారా తెలంగాణ గొప్పతనాన్ని ప్రపంచానికి చాటే విధంగా ఉండాలనే ఉద్దేశంతోనే సీఎం కేసీఆర్ ఆడపడుచులకు చీరల పంపిణీ పథకానికి శ్రీకారం చుట్టారని విద్యుత్ శాఖ మంత్రి జగదీష్ రెడ్డి అన్నారు.

సూర్యాపేటలోని త్రివేణి ఫంక్షన్ హాల్లో తెలంగాణ ఆడ బిడ్డలకు బతుకమ్మ చీరలను పంపిణీ చేసి మాట్లాడారు. ప్రకృతిని ఆరాధించే బతుకమ్మ పండుగ తెలంగాణ జాతికి మాత్రమే సొంతం అని మంత్రి అన్నారు. ప్రభుత్వం ఏటా అందజేస్తున్న బతుకమ్మ కానుక చరిత్రాత్మకమని పేర్కొన్నారు.

టీఆర్ఎస్ పాలనలోనే మహిళలకు సముచిత గౌరవం దక్కిందని అన్నారు. వారి అభ్యున్నతికి దేశం లో ఎక్కడా లేని విధంగా సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నదని పేర్కొన్నారు టీఆర్ఎస్ పాలన చేసి కేంద్రంలోని బీజేపీ తట్టుకోలేకపోతుందన్నారు. ఆ కారణం తోనే టీఆర్ఎస్ ప్రభుత్వం పై మోదీ ప్రభుత్వం కక్ష్య సాధింపు చర్యలకు పూనుకుంటుందని ఆరోపించారు.

కార్యక్రమంలో ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్, మున్సిపల్ చైర్మన్ పెరుమాళ్ల అన్నపూర్ణ, గ్రంథాలయ చైర్మన్ నిమ్మల శ్రీనివాస్ గౌడ్, మార్కెట్ చైర్మన్ ఉప్పల లలితా దేవి, మున్సిపల్ కమిషనర్ సత్యనారాయణ రెడ్డి, వైస్ చైర్మన్ పుట్టా కిషోర్, పట్టణ టీఆర్ఎస్ అధ్యక్షుడు సవరాల సత్యనారాయణ పాల్గొన్నారు.

# 2022-23 రబీ సీజన్ కు పప్పుధాన్యాలు, నూనెగింజల విత్తన మినీకిట్లను సకాలంలో పంపిణీ చేయడం ద్వారా పప్పుధాన్యాలు, నూనెగింజల ఉత్పత్తిని పెంచడానికి కేంద్రం చర్యలు

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 23: విత్తనం అనేది సంపూర్ణ సాంకేతిక పరిజ్ఞానం. పంటల ఉత్పాదకతను 20-25% పెంచే సామర్థ్యాన్ని కలిగి ఉంది. వ్యవసాయానికి మంచి విత్తనాల లభ్యత ఉత్పత్తి, ఉత్పాదకతను పెంచుతుంది, దీని ఫలితంగా రైతులకు అధిక ఆదాయం లభిస్తుంది, తద్వారా వ్యవసాయ పర్యావరణ వ్యవస్థకు, దేశ ఆర్థిక వ్యవస్థకు మొత్తం మీద ప్రయోజనం చేకూరుతుంది. కొన్ని రాష్ట్రాలలో అస్తవ్యస్తమైన, లోటు వర్షపాతం కారణంగా, రబీ పంటలను ముఖ్యంగా పప్పుధాన్యాలు, నూనెగింజలను ముందస్తుగా నాటాల్సిన అవసరం ఏర్పడింది.

2022-23 రబీలో, విత్తనాలను యథావిధిగా పంపిణీ చేయడమే కాకుండా, రాష్ట్రాల్లోని వర్షపాత లోటు ప్రాంతాలను లక్ష్యంగా చేసుకొని పప్పుధాన్యాలు ,నూనెగింజల విత్తన మినీ కిట్లను అందించడంపై కూడా ప్రభుత్వం దృష్టి సారించింది. ఈ మినీ కిట్లను నేషనల్ సీడ్స్ కార్పొరేషన్ (ఎన్ ఎస్ సి), నాఫెడ్ వంటి కేంద్ర సంస్థలు అందిస్తున్నాయి వీటికి పూర్తిగా నేషనల్ ఫుడ్ సెక్యూరిటీ మిషన్ ద్వారా భారత ప్రభుత్వం నిధులు సమకూరుస్తోంది.

ఈ క్రింది లక్ష్యాలతో కొత్తగా విడుదల చేసిన అధిక దిగుబడినిచ్చే వంగడాల విత్తనాలను రైతులకు పంపిణీ చేయడానికి భారీ విత్తన మినికిట్ కార్యక్రమానికి ప్రభుత్వం ఆమోదం తెలిపింది:

ఉత్పత్తి , ఉత్పాదకతను పెంచడానికి రైతులలో తాజా పంట రకాలను ప్రాచుర్యంలోకి తీసుకురావడం;

ఖరీఫ్, 2022లో వర్షపాతం తక్కువగా/లోటు ఉన్న ఉత్తరప్రదేశ్, బీహార్, జార్ఖండ్ రాష్ట్రాలతో పాటు మధ్యప్రదేశ్ , పశ్చిమ బెంగాల్ లో కొన్ని ప్రాంతాలకు పప్పుధాన్యాలు నూనెగింజల విత్తన మినీకిట్ లను పంపిణీ చేయడం;

మహారాష్ట్రలోని విదర్భ ప్రాంతంలో రేప్ సీడ్, ఆవాలు (ఆర్ అండ్ ఎం) పంటల కోసం సంప్రదాయేతర ప్రాంతాన్ని కవర్ చేయడం;

తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక వంటి దక్షిణాది రాష్ట్రాల కోసం ప్రధాన రబీ నూనెగింజలు - వేరుశెనగ ను, ఉత్తర ప్రదేశ్, మధ్యప్రదేశ్, బీహార్ , రాజస్థాన్ లలో అవిసె గింజలు , మహారాష్ట్ర, కర్ణాటక తెలంగాణల్లో కుసుమ వంటి చిన్న నూనెగింజలను పంపిణీ చేయడం.

పప్పుధాన్యాల ఉత్పత్తిని ప్రోత్సహించడానికి, 2022-23లో 11 రాష్ట్రాలకు ముఖ్యంగా ఉత్తర ప్రదేశ్ (1,11,563), జార్ఖండ్ (12,500) , బీహార్ (12,500) వంటి రాష్ట్రాల్లోని వర్షపాత లోటు ప్రాంతాలలో ముందస్తుగా నాటాలనే లక్ష్యంతో 4.54 లక్షల పప్పులు, ఉర్ద్ మినీకిట్లను, 4.04 లక్షల పప్పు విత్తన మినీ కిట్ లను కేటాయించింది, ఇది మొత్తం కేటాయింపుల్లో 33.8%, ఈ మూడు వర్షపాత లోటు రాష్ట్రాలకు గత ఏడాది కంటే 39.4% అధికం.

ప్రభుత్వం 2022-23 నుంచి ' తుర్ మసూర్ ఉరద్ - 370' ((టి ఎం యు-370) అనే ప్రత్యేక కార్యక్రమాన్ని కూడా అమలు చేస్తోంది, దీని ద్వారా మసూర్ పరిధిలోని 120 జిల్లాలు ఉరద్ పరిధిలోని 150 జిల్లాలను పప్పుధాన్యాల పంటల ఉత్పత్తి ,ఉత్పాదకతను పెంచడానికి లక్ష్యంగా పెట్టుకుంది. ఈ జిల్లాలలో గరిష్టప్రాంతాల ఏకీకరణను ధృవీకరించడం ద్వారా కార్యక్రమం అమలు జరుగుతుంది.

రూ.39.22 కోట్ల విలువ చేసే 8.3 లక్షల విత్తన మినీకిట్లను పంపిణీ చేయడం ద్వారా నూనెగింజల పంటలు ప్రోత్సహించ బడుతున్నాయి. అవి రూ. 10.93 కోట్ల విలువ కలిగిన 575000 మినీకిట్లు, వేరుశనగ (రూ. 16.07 కోట్ల విలువ కలిగిన 70500 మినీకిట్లు), సోయాబీన్ (రూ. 11.00 కోట్ల విలువ కలిగిన 125,000 మినీకిట్లు), పొద్దు తిరుగుడు (రూ. 0.65 కోట్ల విలువ గల 32500 మినీకిట్లు) , అవిసె గింజలు (రూ. 0.57 కోట్ల విలువ కలిగిన 26000 మినీకిట్లు) రైతులకు నేరుగా ఉచితంగా అందుతాయి.

రబీ 2021-22 ప్రత్యేక ఆవాల మిషన్ ను ప్రభుత్వం అమలు చేసింది, దీని ఫలితంగా పంట విస్తీర్ణం 20% , ఉత్పత్తి 15% పెరిగింది.

ఈ ఏడాది (2022-23) ప్రత్యేక కార్యక్రమంగా 18 రాష్ట్రాల్లోని 301 జిల్లాల్లో రూ.50.41 కోట్ల విలువ చేసే 2653183 రాప్సీడ్, ఆవాలు మినీకిట్లను పంపిణీ చేసేందుకు ఆమోదం తెలిపింది.

పెంచారు. ఈ ప్రయత్నాలు మంచి ఫలితాలను ఇచ్చాయి. నూనెగింజల ఉత్పత్తి 2014-15లో 27.51 మిలియన్ టన్నుల నుంచి 2021-22 నాటికి 37.70 మిలియన్ టన్నులకు (4వ ముందస్తు అంచనా) పెరిగింది. పప్పుధాన్యాల ఉత్పత్తి కూడా ఇదే విధమైన పెరుగుదల తున్న ధోరణిని చూపించింది. విత్తన మినీకిట్స్ కార్యక్రమం రైతుల పొలాల్లో కొత్త రకాల విత్తనాలను ప్రవేశపెట్టడానికి ఒక ప్రధాన సాధనం . విత్తన మార్పిడి రేటును పెంచడానికి కూడా ఇది కీలక పాత్ర పోషిస్తుంది.

పప్పుధాన్యాలు ,నూనెగింజల ఉత్పాదకత గత మూడు సంవత్సరాలలో గణనీయంగా పెరిగింది. పప్పుధాన్యాల విషయంలో ఉత్పాదకత హెక్టారుకు 727 కిలోలు /హెక్టారు (2018-19) నుండి హెక్టారుకు 980 కిలోలకు ( 4వ ముందస్తు అంచనా2021-22) అంటే 34.8% పెరిగింది. అదేవిధంగా, నూనెగింజల పంటల్లో ఉత్పాదకత హెక్టారుకు 1271 కిలోలు (2018-19) నుండి హెక్టారుకు 1292 కిలోలకు ( 4వ ముందస్తు అంచనా2021-22) పెరిగింది.నూనెగింజలు ,పప్పుధాన్యాల ఉత్పత్తిని పెంచడం ,తద్వారా ఆత్మనిర్భర్ భారత్ లక్ష్యాన్ని నెరవేర్చడంపై ప్రభుత్వం ప్రాధాన్యత గా ఉంది. ఇందుకు ఏరియా విస్తరణ, హెచ్ వై వి ల ద్వారా ఉత్పాదకత, ఎం ఎస్ పి మద్దతు, సేకరణ ద్వారా ఉత్పత్తిని పెంచడం అనే వ్యూహాలను రూపొందించింది.

# ఆధ్యాత్మిక ఆహ్లాదం కలిగించేలా తిరుమల పార్కుల అభివృద్ధి : టీటీడీ చైర్మన్



తిరుమల, సెప్టెంబర్ 23: తిరుమలలో భక్తులు అడుగుపెడుతూనే వారికి ఆధ్యాత్మిక ఆహ్లాదం కలిగేలా పార్కులు అభివృద్ధి చేస్తున్నామని టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి చెప్పారు. మొదటి వైకుంఠం క్యూ కాంప్లెక్స్ ఆనుకుని పునర్నిర్మించిన పార్కును చైర్మన్ సుబ్బారెడ్డి టీటీడీ ఈవో ఏవీ ధర్మారెడ్డితో కలసి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్మన్ మీడియాతో మాట్లాడుతూ? ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశం మేరకు తిరుమలలో పర్యావరణ పరిరక్షణకు పెద్దఎత్తున చర్యలు తీసుకుంటున్నామన్నారు. తిరుమలలో ప్లాస్టిక్ వినియోగం పూర్తిగా నిషేధించి పక్కాగా అమలు చేస్తున్నామని ఆయన తెలిపారు. అలాగే దాతల సహకారంతో పార్కులన్నీ పెద్దఎత్తున పునర్నిర్మిస్తున్నామని, దీని ద్వారా పర్యావరణ పరిరక్షణ మరింతగా జరుగుతుందన్నారు.

అలాగే తిరుమలకు 50 విద్యుత్ బస్సులు నడిపేలా ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఆదేశాలు జారీ చేసి ఆర్టీసీకి బస్సులు అందే ఏర్పాటు చేశారని చైర్మన్ తెలిపారు. ఇందులో భాగంగా సెప్టెంబర్ 27వ తేదీ 10 విద్యుత్ బస్సులను సి ఎం ప్రారంభిస్తారని వివరించారు. 27వ తేదీ తిరుపతిలో కరకం బాడి వైపునుంచి వాసవి భవన్ వరకు నిర్మించిన శ్రీనివాస సేతు ఫ్లై ఓవర్ ను ప్రారంభిస్తారన్నారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా శ్రీవారికి పట్టువస్త్రాలు సమర్పించి 28వ తేదీ ఉదయం నూతన పరకామణి భవనం ప్రారంభిస్తారని చైర్మన్ తెలిపారు. రెండున్నరేళ్ల తరువాత భక్తుల మధ్యన స్వామివారి బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నందువల్ల భారీ సంఖ్యలో భక్తులు వస్తారని అంచనా వేశామన్నారు. ఈ మేరకు అన్ని ఏర్పాట్లు చేశామని ఆయన తెలిపారు. పార్కు పునర్నిర్మాణ దాత హైదరాబాద్ కు చెందిన రవికుమార్, ఆయన కుటుంబ సభ్యులు, సీవీఎస్ఓ నరసింహ కిషోర్, చీఫ్ ఇంజినీర్ నాగేశ్వర రావు, ఎస్ఈ జగదీశ్వర్ రెడ్డి, గార్డెన్ డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాస్, వీజీవో బాలిరెడ్డి పాల్గొన్నారు. అనంతరం చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, ఈవో ఏవీ ధర్మారెడ్డి తిరుమలలో నారాయణగిరి, స్పెషల్ టైప్, జీఎన్ సీ, గీతాపార్కు, పద్మావతి అతిథి గృహం పునర్నిర్మాణ పనులను పరిశీలించారు.

# కేసీఆర్ జాతీయ రాజకీయాల్లోకి రావాలి : ఆర్ఎస్పీ

హైదరాబాద్, సెప్టెంబర్ 23: తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ జాతీయ రాజకీయాల్లోకి రావాల్సిన అవసరం ఉందని రివల్యూషనరీ సోషలిస్టు పార్టీ నాయకులు, కొల్లాం ఎంపీ ప్రేమచంద్రన్ అన్నారు. ఇవాళ రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు వినోద్ కుమార్‌తో, ఆర్ఎస్పీ ఎంపీ ప్రేమచంద్రన్ హైదరాబాద్‌లోని హయత్ హోటల్‌లో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా జాతీయ స్థాయి రాజకీయాలపై, ఇతర పలు అంశాలపై వారు చర్చించారు. జాతీ య స్థాయిలో రాజకీయంగా బలమైన విపక్షం లేకుండా పోయిందని, దీంతో బీజేపీ ఆటలు సాగుతున్నాయని ప్రేమ చంద్రన్ అభిప్రాయ పడ్డారు.

ఈ నేపథ్యంలో టీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, సీఎం కేసీఆర్ జాతీయ రాజకీయాలలోకి రావాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని ప్రేమ చంద్రన్ తన ఆసక్తిని వ్యక్తం చేశారు. జాతీయ స్థాయిలో వివిధ రాజకీయ పార్టీలను, వివిధ రంగాల ప్రముఖులను ఒక తాటిపైకి తీసుకురావాల్సిన అవసరం ఉందని ప్రేమ చంద్రన్ ఈ సందర్భంగా తన మనసులోని మాటను వినోద్ కుమార్‌తో పంచుకున్నారు. ప్రస్తుత జాతీయ రాజకీయాలలో కేసీఆర్ రాజకీయంగా బలమైన ప్రభావాన్ని చూపగలరని, ఆయన వ్యూహాలు చాలా పదునుగా ఉంటాయని ఎంపీ ప్రేమ చంద్రన్ స్పష్టం చేశారు. నాలుగు సార్లు పార్లమెంటు సభ్యులుగా ఎన్నికవడమే కాకుండా కేరళ రాష్ట్రం జల వనరుల శాఖ మంత్రిగా విశేష అనుభవం ఉన్న ప్రేమ చంద్రన్ బెస్ట్ పార్లమెంటేరియన్‌గా, సంసద్ రత్న అవార్డు గ్రహీతగా హైదరాబాద్ రావడంతో ప్రేమ చంద్రన్ ఆహ్వానం మేరకు వినోద్ కుమార్ ప్రత్యేకంగా భేటీ అయ్యారు. పార్లమెంటులో సహచర ఎంపీగా ఉన్నప్పటి నుంచి ప్రేమ చంద్రన్ తో ఉన్న అనుబంధాన్ని వినోద్ కు మారీ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. ఎంపీ ప్రేమ చంద్రన్‌తో బోయినపల్లి వినోద్ కుమార్ భేటీ కావడం రాజకీయంగా ప్రాధాన్యతను సంతరించుకుం ది.

## జైపాల్ రెడ్డి స్మారక గ్రంథాలయాన్ని ప్రారంభించిన మండలి చైర్మన్ గుత్తా



నల్లగొండ, సెప్టెంబర్ 23: నాలెడ్జి ఉంటే గల్లీ నుంచి ఢిల్లీ స్థాయికి ఎదగవచ్చని దివంగత మాజీ కేంద్ర మంత్రి సూదిని జైపాల్ రెడ్డి నిరూపించారు. ఆయన చదువుకున్న కళాశాల ప్రాంగణంలో ఆయన జ్ఞాపకార్థం గ్రంథాలయాన్ని నిర్మించడం గొప్ప విషయం అని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి అన్నారు. శుక్రవారం దేవరకొండ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో మాజీ కేంద్ర మంత్రి జైపాల్ రెడ్డి స్మారక గ్రంథాలయ భవనాన్ని ప్రారంభించి మాట్లాడారు. జైపాల్ రెడ్డి పేరుమీద నిర్మించిన భవనాన్ని ఆయన సమకాలికుడు కే కేశవ రావుచేతుల మీదుగా ప్రారంభోత్సవం చేయడం ఆనందంగా ఉందన్నారు. విద్య ఉంటే ఎంతటి కష్టాలను అయిన జయించవచ్చు. మెరుగైన విద్యను అందించడంతోనే రాష్ట్రాన్ని వేగంగా అభివృద్ధి చేయగలం అనే సంకల్పంతో సీఎం కేసీఆర్ పాఠశాలలు, కళాశాలల అభివృద్ధి కోసం కృషి చేస్తున్నారని గుత్తా తెలిపారు. నేటి యువత ఆదర్శ నేతలను స్ఫూర్తిగా తీసుకుని వారు ఎంచుకున్న రంగాల్లో విజయాన్ని సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమలో..రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఆయాచితం శ్రీధర్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రేగట్టె మల్లికార్జున్ రెడ్డి, దేవరకొండ మున్సిపల్ చైర్మన్ అలంపల్లి నర్సింహ, దేవరకొండ ఎంపీపీ జానీ యాదవ్, పీఏ పల్లి ఎంపీపీ ప్రతాప్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు

## భీంగల్ మున్సిపాలిటీని అద్భుతంగా తీర్చిదిద్దుతాం : మంత్రి వేముల



నిజామాబాద్, సెప్టెంబర్ 23: : నూతనంగా ఏర్పడిన భీంగల్ మున్సిపాలిటీని సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ సహకారంతో సర్వాంగసుందరంగా తీర్చిదిద్దటమే లక్ష్యం అని మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి అన్నారు. వేల్పూర్‌లోని మంత్రి క్యాంప్ ఆఫీస్‌లో భీంగల్ మున్సిపాలిటీ అభివృద్ధి పనుల పురోగతిపై సమీక్ష నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..మున్సిపాలిటీ పనుల్లో వేగం పెంచి త్వరితగతిన పూర్తి చేయాలని, నాణ్యతతో రాజీ పడొద్దని అధికారులను ఆదేశించారు. మున్సిపాలిటీలో నూతనంగా నిర్మించనున్న ఇంటిగ్రేటెడ్ మార్కెట్ భవనం, ఓపెన్ జిమ్‌లు, వైకుంఠధమాల పనుల పురోగతిపై, మున్సిపాలిటీలో ఏర్పాటు చేస్తున్న పబ్లిక్ టాయిలెట్లపై అంశాల వారీగా సమీక్షించారు.

లింబాద్రి గుట్ట వద్ద ఏర్పాటు చేయనున్న అర్బన్ పార్క్ పనులపై మంత్రి ఆరా తీశారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ భగత్, కౌన్సిలర్లు, కన్నె సురేందర్, పార్టీ అధ్యక్షుడు మల్లెల లక్ష్మణ్,మున్సిపాలిటీ ఇంచార్జి మున్సిపల్ కమిషనర్, తహసీల్దార్ రాజేందర్,పబ్లిక్ హెల్త్ ఈఈ మురళీ మనోహర్, ఏఈ రఘు తదితరులు పాల్గొన్నారు.

## మహిళల సంతోషమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయం : మంత్రి గంగుల



కరీంనగర్, సెప్టెంబర్ 23 (నేటినిజం ప్రతినిధి): ఆడబిడ్డల సంతోషమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని బీసీ సంక్షేమ శాఖ మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. శుక్రవారం కరీంనగర్ పట్టణంలోని రాంనగర్ మహిళా సంఘ భవనంలో బతుకమ్మ చీరల పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఆడబిడ్డల సంతోషమే ధ్యేయంగా అద్భుతమైన పథకాలు అమలు చేస్తోందన్నారు. తెలంగాణ రాష్ట్రం వచ్చిన తర్వాత బతుకమ్మ కానుకగా చీరల పంపిణీ కార్యక్రమం చేపట్టామన్నారు.

పువ్వులను దేవతలుగా భావించి పండుగ జరుపుకునే పద్ధతి ప్రపంచం ఎక్కడా లేదన్నారు. గతంలో నీటి కోసం, కరెంటు కోసం ఇబ్బందులు పడేవారమన్నారు. నేడు ఆ పరిస్థితులు లేవని మంత్రి గుర్తు చేశారు.

కార్యక్రమంలోజిల్లా కలెక్టర్ ఆర్.వి. కర్ణన్, నగర మేయర్ వై. సునీల్ రావు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అనిల్ కుమార్ గౌడ్, మున్సిపల్ కమిషనర్ సేవా ఇస్లావత్, డిప్యూటీ మేయర్ చల్ల స్వరూప రాణి, కార్పొరేటర్ బోనాల శ్రీకాంత్, గుగ్గిళ్ల జయశ్రీ, కోఆప్షన్ మెంబెర్ నందిల్ల రమ, తహసీల్దార్ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు జిల్లాలో తెలంగాణా వైఎస్ఆర్ పార్టీ అధ్యక్షురాలు షర్మిల పాదయాత్ర.

సంగారెడ్డి, సెప్టెంబర్, 23 (నేటి నిజం ప్రతినిధి): తెలంగాణ వైఎస్ఆర్ పార్టీ అధ్యక్షురాలు షర్మిల పాదయాత్ర ఈనెల 24న సంగారెడ్డి జిల్లాలో ప్రవేశిస్తుందని తెలంగాణ వైఎస్ఆర్ పార్టీ సంగారెడ్డి జిల్లా అధ్యక్షులు గౌరీ రెడ్డి శ్రీధర్ రెడ్డి అన్నారు. కంబాలపల్లి నుండి సదాశివపేట, నందికంది మీదుగా పెద్దాపూర్ వరకు షర్మిలమ్మ పాదయాత్ర కొనసాగుతుందని ఆయన చెప్పారు. స్వాగతం పలికేందుకు భారీగా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. వైయస్ రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా సంగారెడ్డి జిల్లాకు ఎంతో సహాయం అందించారని అన్నారు. 24, 25, 26, 27 వరకు జిల్లాలో షర్మిలమ్మ పాదయాత్ర చేయనున్నారు. కార్యకర్తలు ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని సమస్యలు విన్నవించాలని కోరారు. శుక్రవారం నాడు సంగారెడ్డి లోని పోతిరెడ్డిపల్లి జనప్రియ హోటల్లో విలేకరుల సమావేశంలో శ్రీధర్ రెడ్డి ఈ విషయాలను వెల్లడించారు. షర్మిలమ్మ పెద్దాపూర్ లో బస చేస్తారని చెప్పారు. సంగారెడ్డి జిల్లాలో నాలుగు రోజులపాటు ఈ యాత్ర కొనసాగుతుందని, ప్రజలు అధికంగా పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షులు గౌరీ రెడ్డి శ్రీధర్ రెడ్డి, పాదయాత్ర కోఆర్డినేటర్ శాంతి కుమార్, పటాన్ చేరువు అధ్యక్షులు ఆర్ చంద్రశేఖర్, సిద్దిపేట జిల్లా అధ్యక్షులు రామలింగారెడ్డి, తులసి దాస్ గౌడ్, తుకారం లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణలోనే అతిపెద్ద కాంస్య విగ్రహం..

# వీరనారి ఐలమ్మ విగ్రహదాతకు అభినందనల వెల్లువ



మెదక్, సెప్టెంబర్ 23 : నేటినిజం (ప్రతినిధి):తెలంగాణ రాష్ట్రంలో వీరనారి చిట్యాల ఐలమ్మ కాంస్య విగ్రహ ఆవిష్కరణ సంగారెడ్డి జిల్లా పటాన్ చెరు మండలం చిట్కుల్ గ్రామంలో ఈ నెల 26న జరుగనుంది. తెలంగాణలోనే మొట్టమొదటి ఎత్తైన ఈ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమానికి మంత్రి కేటీఆర్ ప్రత్యేక అతిథిగా విచేస్తున్నారు. అత్యంత్య ఎత్తైన చాకలి ఐలమ్మ విగ్రహ ఏర్పాటు జరుగుతుందన్న విషయం రజక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుల ద్వారా తెలుసుకున్న చాకలి ఐలమ్మ మనుమడు రామచంద్రం చిట్కుల్ గ్రామానికి చేరుకుని విగ్రహ దాత, టీఆర్ ఎస్ రాష్ట్ర నాయకుడు, చిట్ కుల్ సర్పంచ్ నీల మధు ముదిరాజ్ ను శాలువా కప్పి సన్మానించి ప్రత్యేకంగా అభినందించారు.

ఈ సందర్భంగా నీలం మధు ముదిరాజ్ మాట్లాడుతూ.. భూమి కోసం, భుక్తి కోసం వెట్టిచాకిరి విముక్తి కోసం అలుపెరుగని ధైర్యసాహసాలను ప్రదర్శించి రజాకార్ల దాష్టీకానికి ఎదురొడ్డి నిలిచి.. వెన్ను చూపకుండా పోరాడిన తెలంగాణ వీర వనిత ఐలమ్మ గొప్పతనాన్ని ప్రపంచం నలుమూలల చాటిచెప్పేలా కృషి చేస్తామన్నారు. ఇందులో భాగంగానే తెలంగాణ రాష్ట్రం లో కెల్ల అతిపెద్ద విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకే సంకల్పించాలామన్నారు. ఇందుకోసం రాష్ట్ర రజక నేతలు ఎంతో శ్రమిస్తున్నారని గుర్తుకు చేశారు.

ఇక .. ఐలమ్మ కాంస్య విగ్రహవిష్కరణకు మంత్రులు కేటీఆర్, హరీశ్ రావు రానున్నారని, వారి చేతుల మీదుగా ఈ విగ్రహవిష్కరణ జరగబోవడం సంతోషంగా ఉందని మధు అన్నారు. తెలంగాణ వీరవనిత ఐలమ్మ మనుమడు రామచంద్రంతో పాటు వారి కుటుంబ సభ్యులు శుక్రవారం చిట్కుల్ గ్రామాన్ని సందర్శించారు. కార్యక్రమంలో రజక సంఘం రాష్ట్ర కార్యదర్శి జీతయ్య, చిట్కుల్ వెంకటేశ్ , సత్తయ్య, ఆంజనేయులు సురేష్ లతో పాటు రాష్ట్ర కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# గుజరాత్ నుంచి యుఎస్ఎకు శాకాహార శ్రేణి కింద మొక్కల ఆధారిత మాంస ఉత్పత్తుల తొలి సరుకు ఎగుమతి

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 23: ప్రత్యకమైన విధానం ద్వారా తయారుచేసిన వ్యవసాయ ఆహార ఉత్పత్తుల ఎగుమతులను ప్రోత్సహించేందుకు,ఉత్పత్తుల ఎగుమతులను ప్రోత్సహించే అత్యున్నత సంస్థ అయిన అగ్రికల్చరల్ అండ్ ప్రాసెస్డ్ ఫుడ్ ప్రోడక్ట్స్ ఎక్స్‌పోర్ట్ అథారిటీ (ఎపిఇడిఎ - వ్యవసాయ, తయారు చేసిన ఆహార ఉత్పత్తుల ఎగుమతి అథారిటీ) ద్వారా శాకాహార ఆహార వర్గంలోకి వచ్చే ప్లాంట్ బేస్డ్ మీట్ ప్రోడక్ట్స్ ( శాకాహార లేదా మొక్కల ఆధారిత మాంస ఉత్పత్తులను)గుజరాత్‌లోని ఖదాలోని నదియాద్ నుంచి యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ అమెరికా (యుఎస్ఎ)లోని కాలిఫోర్నియాకు తొలి సరుకును ఎగుమతి పంపడాన్ని కేంద్రం సులభతరం చేసింది.

అభివృద్ధి చెందిన దేశాలలో శాకాహార ఉత్పత్తులకు ప్రాచుర్యం పెరుగుతున్నందున, శాకాహార ఉత్పత్తులలో లభించే అధిక పోషక విలువల కారణంగా శాకాహార ఉత్పత్తులకు అంతర్జాతీయ మార్కెట్‌లో భారీ ఎగుమతి సంభావ్యత ఉంది. శాకాహార ఉత్పత్తులలో పుష్కలంగా పీచు పదార్థం ఉండటం, తక్కువ కొలెస్టరాల్ ఉండడంతో అవి అంతర్జాతీయంగా ప్రత్యామ్నాయ ఆహార ఉత్పత్తులుగా మారుతున్నాయి.

నదియాద్ నుంచి యుఎస్ఎకు ఎగుమతి చేసిన తొలి సరుకులో మోమోలు, మినీ సమోసాలు, చెక్కలు, చేగోడీలు, స్ప్రింగ్ రోల్స్, బర్గర్లు తదితరాలు ఉన్నాయి. ఇందుకు అవసరమైన గణాంక తదితర మద్దతును ఖడా జిల్లా పాలనా యంత్రాంగం అందించింది.

నూతన విదేశీ గమ్యాల అన్వేషించాల్సిన అవసరాన్ని ఉద్ఘాటిస్తూ, సంప్రదాయ పశు ఆధారిత మాంస ఉత్పత్తుల మార్కెట్‌కు భంగం కలిగించకుండా మొక్కల ఆధారిత మాంస ఉత్పత్తులను భారీ ఎత్తున ప్రోత్సహించేందుకు ఎపిఇడిఎ పని చేస్తోందని ఎపిఇడిఎ చైర్మన్ డాక్టర్ ఎం. అంగముత్తు తెలిపారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ, భవిష్యత్తులో కూడా ఎపిఇడిఎ ఎగుమతి సంబంధిత కార్యకలాపాలకు అవసరమైన మద్దతు ఇస్తామని ఖదా జిల్లా మెజిస్ట్రేట్ శ్రీ కె.ఎల్ బచానీ హామీ ఇచ్చారు. ఎపిఇడిఎ గుజరాత్ ప్రాంత అధిపతి కృషి కారణంగా నదియాద్ నుంచి యుఎస్ఎకు శాకాహార ఉత్పత్తుల సరుకు ఎగుమతి సాధ్యమైందని బచానీ వెల్లడించారు. రానున్న నెలల్లో ఆస్ట్రేలియా, ఇజ్రాయెల్, న్యూజిలాండ్ సహా ఇతర దేశాలకు చెక్కలు, ఇతర స్నాక్స్, జున్ను తదితర పలురకాల శాకాహార ఉత్పత్తుల ఎగుమతిని ప్రోత్సహించేందుకు ఎపిఇడిఎ ప్రణాళికలు సిద్ధం చేసింది. ఎపిఇడిఎ ఎగుమతుల జాబితాలో మరిన్ని శాకాహార ఉత్పత్తులను జత చేయాల్సిన అవసరాన్ని ఈ సందర్భంగా ఎపిఇడిఎ గుజరాత్ ప్రాంత అధిపతి నొక్కి చెప్పారు. శాకాహార ఉత్పత్తుల తొలి సరుకుని గ్రీన్‌నెస్, హోల్‌సమ్ ఫుడ్స్ ఎగుమతి చేశాయి.

దృశ్య మాధ్యమం ద్వారా వాణిజ్య ప్రదర్శనలు, రైతుల అనుసంధాన పోర్టల్, ఇ- ఆఫీస్, హార్టినెట్ ట్రేసెబిలిటీ సిస్టం, కొనుగోలుదారు, అమ్మకందారుల సమావేశాలు, విదేశీ కొనుగోలుదారులు విచారించేందుకు వీలుగా రివర్స్ కొనుగోలుదారు, అమ్మకందారుల సమావేశాలు, నిర్దిష్ట ఉత్పత్తికి ప్రచారాలు తదితర విషయాలపై ఎపిఇడిఎ పలు ఎగుమతి ప్రోత్సాహక కార్యకలాపాలను, చొరవలను చేపట్టింది.

రాష్ట్రం నుంచి ఎగుమతిని ప్రోత్సహించేందుకు, మౌలిక సదుపాయాల సృష్టి కోసం రాష్ట్ర ప్రభుత్వంతో ఎపిఇడిఎ సన్నిహితంగా పని చేస్తోంది. ఎగుమతి పరీక్షలు, అవశేష పర్యవేక్షణ ప్రణాళికల కోసం గుర్తించిన ప్రయోగశాలల ఆధునీకరణ, బలోపేతం చేయడంలో ఎపిఇడిఎ సాయాన్ని అందిస్తుంది. వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతిని పెంచడానికి మౌలిక సదుపాయాల అభివృద్ధి, నాణ్యత, మెరుగుదల, మార్కెట్ అభివృద్ధి ఆర్థిక సహాయ పథకాల కింద కూడా తోడ్పాటును అందిస్తుంది.

ఎగుమతిదారులు తమ ఆహార ఉత్పత్తులను అంతర్జాతీయ మార్కెట్‌లో మార్కెట్ చేసేందుకు ఎగుమతిదారులకు వేదికను అందించేందుకు అంతర్జాతీయ వాణిజ్య ప్రదర్శనలలో ఎగుమతిదారులు పాలుపంచుకునేందుకు ఎపిఇడిఎ వీలు కల్పిస్తుంది. దీనితో పాటుగా . వ్యవసాయ ఎగుమతులను ప్రోత్సహించేందుకు ఎపిఇడిఎ ఆహార్ (ఎఎహెచ్ఎఆర్), ఆర్గానిక్ వరల్డ్ కాంగ్రెస్, బయోఫాక్ ఇండియా తదితరాలను నిర్వహిస్తుంది.

ఎగుమతి చేయనున్న ఉత్పత్తుల నాణ్యత ధ్రువీకరణ సాఫీగా జరిగేలా చూసేందుకు, ఎపిఇడిఎ ఎగుమతిదారులకు చెందిన భిన్న వస్తువులను పరీక్షించే సేవలను అందించేందుకు భారతదేశ వ్యాప్తంగా 220 ప్రయోగశాలలను గుర్తించింది.

# సీఎం కేసీఆర్‌పై విషం చిమ్ముతున్న మోదీ, అమిత్ షా : మంత్రి జగదీష్ రెడ్డి




నల్లగొండ, సెప్టెంబర్ 23: సీఎం కేసీఆర్‌పై ప్రధాని మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా విషం చిమ్ముతున్నారని విద్యుత్ శాఖ మంత్రి జగదీష్ రెడ్డి ఫైర్ అయ్యారు. శుక్రవారం మునుగోడు మండల కేంద్రంలో టీఆర్ఎస్ పార్టీ కుటుంబ సభ్యుల ఆత్మీయ సమ్మేళనంలో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు.

మోదీ సొంత రాష్ట్రం గుజరాత్‌లో ప్రజలు మోదీని నిలదీస్తున్నారు. తెలంగాణలో అమలు అయ్యే పథకాలు నువ్వు ఎందుకు అమలు చేయడం లేదని ప్రధానిని నిలదీస్తున్నారు. అందుకే మోదీ తెలంగాణ పై విషం కక్కుతున్నారని ఆయన మండిపడ్డారు. గుజరాత్‌లో రైతులకు బీజేపీ ప్రభుత్వం ఇచ్చే 6 గంటల కరంట్‌కు మీటర్లు పెట్టి డబ్బులు వసూలు చేస్తున్నారు. మరి తెలంగాణలో కేసీఆర్ అన్నదాతలకు 24 గంటల ఉచిత కరంట్ ను, ఇస్తున్నారు. నువ్వు ఎందుకు ఇయ్యావ్ అని గుజరాత్ రైతులు మోదీని ప్రశ్నిస్తున్నారు. ఆసరా పెన్షన్‌లు కూడా తెలంగాణలో ఇచ్చినట్లుగానే ఇవ్వాలని దేశ ప్రజలు మోదీని నిలదీస్తున్నారు. దీంతో దేశంలో తల ఎత్తుకొని తిరిగే పరిస్థితులు లేవని గ్రహించిన మోదీ కేసీఆర్ పై కక్ష్య కట్టిండు.

అందుకే ఎలాగైనా కేసీఆర్ పని పెట్టాలని కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. రాజగోపాల్ రెడ్డి అనే దొంగను అడ్డం పెట్టుకొని బీజేపీ వాళు కుట్రలకు తెరలేపారు. మునుగోడులో టీఆర్ఎస్ కార్యకర్తలు బీజేపీ ని తరిమి కొట్టాలని మంత్రి పిలుపునిచ్చారు.

కార్యక్రమంలో ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్ రావు, ఎమ్మెల్యేలు కంచర్ల భూపాల్ రెడ్డి, చిరుమర్తి లింగయ్య, పైళ్ల శేఖర్ రెడ్డి, మునుగోడు టీఆర్ఎస్ నియోజకవర్గ ఇంచార్జి కుసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి ఉన్నారు.

# త్రిపురలో బీజేపీకి మరో ఎదురుదెబ్బ

అగర్తలా:, సెప్టెంబర్ 23:త్రిపుర రాష్ట్రంలో అధికార బీజేపీకి మరో ఎదురుదెబ్బ తగిలింది. గత ఏడాది కాలంగా బీజేపీకి ఇద్దరు ఎమ్మెల్యేలు, ఒక మంత్రి రాజీనామా చేయగా.. తాజాగా మరో ఎమ్మెల్యే గుడ్‌బై చెప్పారు. సీనియర్ నాయకుడు బుర్బా మోహన్ త్రిపుర (67) తన ఎమ్మెల్యే పదవికి, బీజేపీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేశారు. బుర్బా మోహన్ 2018లో కర్బూక్ అసెంబ్లీ స్థానం నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు.

ఈ మేరకు తన రాజీనామా లేఖను త్రిపుర అసెంబ్లీ స్పీకర్‌కు పంపించారు. అయితే తన రాజీనామాకు గల కారణాలు తెలిపేందుకు ఆయన నిరాకరించారు. బీజేపీని వీడిన ఆయన ఇప్పుడు ౹ఎఖఖీం (టిప్రహా ఇండిజనస్ ప్రోగ్రెసివ్ రీజనల్ అలయన్స్) పార్టీలో చేరనున్నారు. బుర్బా మోహన్‌తోపాటు సీనియర్ బీజేపీ నేత, మాజీ డిప్యూటీ స్పీకర్ గౌరశంకర్ రీంగ్ కూడా బీజేపీని వీడి ౹ఎఖఖీంలో చేరేందుకు సిద్ధమయ్యారు.

బుర్బా మోహన్ త్రిపుర కంటే ముందు బీజేపీని వీడిన వారిలో అశీశ్‌దాస్, సుదీప్ రాయ్ బర్మాన్, అశీశ్ కుమార్ సాహా ఉన్నారు. అశీశ్‌దాస్ బీజేపీలోనే చేరగా.. బర్మాన్, సాహా ఇద్దరూ కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు.

## విద్యార్థులు లక్ష్యాన్ని పెట్టుకొని ఉన్నత ఉద్యోగాలు సాధించాలి : కిషోర్‌గౌడ్



హైదరాబాద్, సెప్టెంబర్ 23: విద్యార్థులు, నిరుద్యోగుల తాత్కాలికమైన ఆనందాలను సంతోషాలను పక్కనపెట్టి లక్ష్యాన్ని పెట్టుకొని ఉన్నత ఉద్యోగాలు సాధించే విధంగా ప్రణాళికను రూపొందించుకోవాలని రాష్ట్ర బీసీ కమిషన్ సభ్యులు కె.కిషోర్‌గౌడ్ పిలుపునిచ్చారు. విద్యానగర్‌లోని స్వామి వివేకానంద డిగ్రీ కళాశాలలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో గ్రూప్ 3, గ్రూప్ 4, వివిధ పోటీ పరీక్షలకు శిక్షణ పొందే నిరుద్యోగుల కోసం ఏర్పాటు చేసిన బీసీ స్టడీ సెంటర్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కిషోర్‌గౌడ్ మాట్లాడుతూ? ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో నిర్లక్ష్యానికి గురైన వర్గాలను పైకి తీసుకురావడంకోసం ముఖ్యమంత్రి కె?సీఆర్ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారని అందుకు ఉదాహారణకు నూతనంగా 50 బీసీ స్టడీ సెంటర్‌లను ఏర్పాటు చేయడమేనన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత తెలంగాణ వాళ్ళకే ఎక్కువ ఉద్యోగాలు దక్కాలనే ఉద్ధేశ్యంతో జోనల్ వ్యవస్థను సరిచేసి 95శాతం స్థానిక యువతకే ఉద్యోగాలు దక్కేవిధంగా కొత్త జోనల్ వ్యవస్థను తీసుకురావడం వలన, దానిలో 95శాతం ఉద్యోగాలు తెలంగాణ యువతకే దక్కుతాయని తెలియజేశారు.

ఇప్పటికే లక్ష ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేయడం జరిగిందన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో తెలంగాణ ప్రాంతంలో కేవలం 3- 4 స్టడీ సెంటర్లు మాత్రమే ఉండేవని అవి కూడా నామమాత్రంగా శిక్షణ కేంద్రాలుగా ఉండేవన్నారు. కానీ తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత 12 నూతన స్టడీ సెంటర్‌లను ఏర్పాటు చేసి, 365రోజులు అందులో వివిధ రకాల పోటి పరీక్షలకు శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వం 85వేలకు పైగా ఉద్యోగాలకు అనుమతి ఇవ్వడం జరిగిందని, వాటి కోసం సిద్ధం కావాలనే ఉద్దేశ్యంతో మరొక 50 సబ్ సెంటర్‌లను ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. నిరుద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని శిక్షణ పొంది మంచి ప్రభుత్వ ఉద్యోగాలను సాధించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి ఆశన్న, స్వామి వివేకానంద డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా.సుకన్య, కోర్సు కో ఆర్డినేటర్ సుచిత్ర, పి.వి.ఆర్ కోచింగ్ సెంటర్ కోఆర్డినేటర్ వెంకటేశ్వర్‌రావు, జిల్లా సహాయ సంక్షేమశాఖ అధికారులు నర్సింహులు, సంజీవులు, యాసిర్ అలీ, పెద్ద ఎత్తున శిక్షణ తీసుకునే విద్యార్థులు హాజరయ్యారు.

## కుప్పంలో చంద్రబాబు పని ఖల్లాస్ : ఏపీ మంత్రి కాకాణి

అమరావతి, సెప్టెంబర్ 23: టీడీపీ అధినేత చంద్రబాబు 35 సంవత్సరాలుగా ఎమ్మెల్యేగా ఉంటూ కుప్పం నియోజక వర్గానికి ఏమి చేయలేకపోయారని ఏపీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఆరోపించారు. రాబోయే ఎన్నికల్లో బాబు కుప్పం నుంచి పోటీ చేయరని, చేసినా ఓడిపోవడం ఖాయమని జోస్యం చెప్పారు. నియోజకవర్గ ప్రజలు చంద్రబాబు ను, టీడీపీని తరిమి కొట్టే పరిస్థితి దగ్గర్లోనే ఉందని పేర్కొన్నారు.

దివంగత ఎన్టీఆర్ అంటే తమకు ఎనలేని అభిమానం ఉండడం వల్లే ఎన్టీఆర్ పేరిట జిల్లాను ఏర్పాటు చేశా మని వెల్లడించారు. మామ ఎన్టీఆర్‌కు వెన్నుపోటు పొడిచి దొడ్డిదారిన అధికారంలోకి వచ్చిన చంద్రబాబు ఎన్టీ ఆర్ పేరు ప్రస్తావించే అర్హత లేదని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఆరోగ్యశ్రీ పేరును మార్చినపుడు తామేమైనా ప్రభుత్వాన్ని నిలదీశామా? అని ప్రశ్నించారు. చంద్రబాబు ఒక అబద్దాల పుట్టని విమర్శించారు.

## షిండే వర్గానికి కోర్టు షాక్- శివాజీ పార్క్‌లో దసరా వేడుకలకు ఉద్ధవ్‌కు అనుమతి

ముంబై, సెప్టెంబర్ 23: మహారాష్ట్ర సీఎం ఏక్‌నాథ్ షిండే వర్గానికి బాంబే హైకోర్టు షాక్ ఇచ్చింది. ముంబైలోని ప్రముఖ శివాజీ పార్కులో దసరా వేడుకల సభ కోసం ఉద్ధవ్ ఠాక్రే నేతృత్వంలోని శివసేనకు అనుమతి ఇచ్చింది. బీజేపీ కుట్ర వల్ల శివసేన రెండు వర్గాలుగా చీలిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో శివాజీ పార్క్‌లో దసరా వేడుకలు నిర్వహించేందుకు ఉద్ధవ్ ఠాక్రే, షిండే వర్గాలు పోటీ పడ్డాయి. అయితే బృహన్ ముంబై మున్సిపల్ కార్పొరేషన్ శాంతిభద్రతల సమస్య పేరుతో ఈ రెండు వర్గాలకు అనుమతి నిరాకరించింది. దీంతో ఉద్ధవ్ ఠాక్రే నేతృత్వంలోని శివసేన దీనిపై బాంబే హైకోర్టును ఆశ్రయించింది.

మరోవైపు షిండే వర్గానికి చెందిన దాదర్ ఎమ్మెల్యే సదా సర్వాంకర్ కూడా బాంబే హైకోర్టును ఆశ్రయించారు. శివసేన మెజార్టీ వర్గం షిండే నేతృత్వంలో ఉందని తెలిపారు. ఈ నేపథ్యంలో పార్టీ ఎవరికి చెందుతుందో అన్నది తేలే వరకు ఉద్ధవ్ ఠాక్రే వర్గం పిటిషన్‌పై ఎలాంటి నిర్ణయం తీసుకోవద్దని కోర్టును కోరారు. అయితే ఈ అభ్యర్థనను బాంబే హైకోర్టు తిరస్కరించింది. శివాజీ పార్కులో దసరా సభకు ఉద్ధవ్ ఠాక్రే నేతృత్వంలోని శివసేనకు అనుమతి ఇచ్చింది.

కాగా, శివసేన పార్టీ ఆవిర్భవించిన 1966 నుంచి ప్రతి ఏటా ముంబైలోని శివాజీ మహారాజ్ పార్క్‌లో దసరా వేడుకలను శివసేన నిర్వహిస్తున్నది. అయితే కరోనా వల్ల గత రెండేళ్లుగా దసరా ఉత్సవాలు జరుగలేదు. మరోవైపు శివసేనలో చీలిక వల్ల ఈ ఏడాది శివాజీ పార్క్‌లో దసరా బహిరంగ సభ నిర్వాహణకు రెండు వర్గాలు పోటీ పడ్డాయి. అయితే ఉద్ధవ్ ఠాక్రేకు అనుకూలంగా బాంబే హైకోర్టు స్పందించింది. మరోవైపు సీఎం షిండే నేతృత్వంలోని శివసేన రెబల్ వర్గం బాంద్రా కుర్లా కాంప్లెక్స్ గ్రౌండ్‌లో దసరా వేడుకల నిర్వాహణకు ఇప్పటికే బీఎంసీ నుంచి అనుమతి పొందింది.

## బీజేపీ నేతల అత్యుత్సాహం.. నిప్పులు చెరిగిన మంత్రి జగదీశ్ రెడ్డి

యాదాద్రి భువనగిరి, సెప్టెంబర్ 23: చౌటుప్పల్ ఎరువుల గోదాం శంకుస్థాపన కార్యక్రమంలో అత్యుత్సాహం ప్రదర్శించిన బీజేపీ నాయకులపై రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి జగదీశ్ రెడ్డి నిప్పులు చెరిగారు.

ఉన్నది ఉన్నట్లు మాట్లాడితే బీజేపీ నాయకులకు కోపం వస్తుందని మంత్రి పేర్కొన్నారు. ఈ సభలో డీసీసీబీ చైర్మన్ గొంగిడి మహేందర్ రెడ్డి మాట్లాడుతూ.. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం.. తెలంగాణకు చేసిందేమీ లేదన్నారు.

దీంతో మహేందర్ రెడ్డి ప్రసంగాన్ని బీజేపీకి చెందిన సింగిల్ విండో డైరెక్టర్లు అడ్డుకున్నారు.

ఈ క్రమంలో మంత్రి జగదీశ్ రెడ్డి ఆ సింగిల్ విండో డైరెక్టర్లపై నిప్పులు చెరిగారు.

బీజేపీ ప్రభుత్వాల బట్టలు విప్పుతాం.. ఆ సమయం త్వరలోనే వస్తుందన్నారు. ఉన్నది ఉన్నట్టు మాట్లాడితే బీజేపీ నాయకులకు కోపం వస్తుంది. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో సంక్షేమ పథకాలను ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు.

రైతులకు మోదీ చేసిందేమీ లేదన్నారు. టీఆర్ఎస్ పార్టీని ప్రశ్నించే దమ్ము బీజేపీకి ఉందా? అని ప్రశ్నించారు. కేసీఆర్ నాయకత్వాన్ని దేశ ప్రజలు కోరుకుంటున్నారని మంత్రి జగదీశ్ రెడ్డి పేర్కొన్నారు.

# నేడు ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పొంగులేటి పర్యటన



ఖమ్మం, సెప్టెంబర్ 23: (నేటినిజం ప్రతినిధి): తెరాస రాష్ట్ర నాయకులు, ఖమ్మం మాజీ పార్లమెంటు సభ్యులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి శనివారం ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పర్యటించనున్నారు. పర్యటనలో భాగంగా ఉదయం 10.30 గంటల నుంచి నేలకొండపల్లి మండలంలోని రాయిగూడెం, చెరువుమాదారం, అజయ్ తండా, కొత్త కొత్తూరు, నేలకొండపల్లి గ్రామంలో, సాయంత్రం 4 గంటల నుంచి ఖమ్మం పట్టణంలోని చర్చి కాంపౌండ్, టీఎన్జీఓస్ కాలనీ, సాయత్రం 6.30 గంటల నుంచి కొత్తగూడెం పట్టణంలోని కొత్తగూడెం క్లబ్ లో జరిగే టీజికేఎస్ వైస్ ప్రెసిడెంట్ సోమిరెడ్డి ఉద్యోగ విరమణ సభలో పాల్గొంటారు. పర్యటనలో భాగంగా వివాహాది శభకార్యక్రమాలతో పాటు పలు ప్రయివేటు కార్యక్రమాలకు హాజరవుతారన్నారు. కావున పొంగులేటి అభిమానులు, టీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

# ప్రభుత్వ ప్రాధాన్యత కార్యక్రమాలను త్వరితగతిన పూర్తి చేయాలి..! -అదనపు కలెక్టర్ రాజార్షి.



సంగారెడ్డి, సెప్టెంబర్ 23 (నేటి నిజం ప్రతినిధి) జిల్లాలో ప్రభుత్వ ప్రాధాన్యత కార్యక్రమాల పనులు త్వరితగతిన పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ రాజర్షి షా సంబంధిత అధికారులకు ఆదేశించారు.

శుక్రవారం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాలు నుండి అదనపు కలెక్టర్ ఎంపీడీఓ లు,ఎంపీ ఓ లు,డి ఎల్ పి ఓ లు,మండల ప్రత్యేకాదికారులు,నియోజక వర్గ ప్రత్యేక అధికా రులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా తెలంగాణ క్రీడా ప్రాంగణాలు, హరితహారం,దళిత బందు ,పారిశుద్ధ్యం, మన ఊరు మనబడి పనుల పురోగతి తదితర అంశాలపై సమీక్షించి దిశా నిర్దేశం చేశారు.

ఈ సందర్భంగా రాజార్శి మాట్లాడుతూ ప్రభుత్వ ప్రాధాన్యత కార్యక్రమాలను వేగవంతంగా పూర్తి చేసేలా చొరవ చూపాలన్నారు.

జిల్లా లో తెలంగాణ క్రీడా ప్రాంగణాలు వేగవంతంగా పూర్తి కావాలన్నారు. స్థలం లేక జాప్యం జరుగరాదని, ప్రత్యామ్నాయ స్థలాన్ని గుర్తించి వెంటనే పూర్తి చేయాలన్నారు. కాంపోనెంట్స్ యువత, స్థానికుల ప్రాధాన్యత మేరకు ఏర్పాటు చేయాలన్నారు.క్రీడా ప్రాంగణాల పనులు నాణ్యతగా ఉండాలని స్పష్టం చేశారు.

జిల్లాకు కేటాయించిన హరిత లక్ష్యం మేరకు వంద శాతం పూర్తి చేయాలన్నారు.

మన ఊరు మనబడి పనులు త్వరితగతిన పూర్తి కావాలన్నారు. పూర్తయిన పనులకు వెంట వెంటనే ఎంబి పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు.

గ్రామపంచాయతీలలో పారిశుద్ధ్య నిర్వహణ సక్రమంగా జరగాలన్నారు. చెత్త అమ్మకంతో గ్రామపంచాయతీకి రెగ్యులర్గా ఆదాయం వచ్చేలా చర్యలు చేపట్టాలని సూచించారు. వైకుంతధామాలు,వైకుంత రథాలు వినియోగంలోకి తీసుకురావాలనీ తెలిపారు.

దళిత బందు పథకంలో లబ్ది పొందిన లబ్దిదారుల వద్దకు వెళ్ళి వారు తీసుకున్న యూనిట్ తో పొందుతున్న లబ్ది,వారి జీవన స్థితిగతులను పరిశీలించి నివేదికను సమర్పించాలని మండల ప్రత్యేక అధికారులకు సూచించారు.ఆయా అధికారులు వారి ఉన్నతికి అన్ని విధాల సలహా సూచనలు ఇస్తూ ప్రోత్సహించాలని కోరారు.

ఈ వీడియో కాన్ఫరెన్స్ లో జడ్పీ సీఈఓ ఎల్లయ్య, డిపిఓ సురేష్ మోహన్, , డి ఆర్ డి ఓ శ్రీనివాసరావు, డి సి ఓ ప్రసాద్, నియోజక వర్గ ప్రత్యేక అధికా రులు,మండల ప్రత్యేక అధికారులు, డి.ఎల్.పి. ఓ లు,ఎం.పి. ఓ.లు, ఎం.పి.డి.ఓ లు, తదితరులు పాల్గొన్నారు.

# పోడు భూముల సమీక్ష లో పాల్గొన్న సిఎల్పీ నేత భట్టి విక్రమార్క



ఖమ్మం, సెప్టెంబర్ 23: (నేటినిజం ప్రతినిధి): తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ శాసనసభాపక్ష నేత, మధిర శాసనసభ్యులు భట్టి విక్రమార్కమల్లు శుక్రవారం ఖమ్మం జిల్లా కలెక్టర్ కార్యాయంలో పోడు భూముల సమస్యల పరిష్కారానికి జరిగిన జిల్లా స్థాయి సమీక్ష సమావేశం లో పాల్గొని పోడు రైతుల సమస్యలను అధికారులకు వివరించి, సమస్యల పరిష్కారానికి సూచనలు చేశారు, గత కొంత కాలంగా పోడు సమస్యల మీద రాష్ట్ర వ్యాప్తంగా సిఎల్పీ నేత పర్యటించి పోడు రైతులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు.

# టికెట్ల సేల్స్ తొక్కిసలాటతో మాకేం సంబంధం?.. ప్రశ్నించిన హెచ్‌సీఏ ప్రెసిడెంట్ అజారుద్దీన్

హైదరాబాద్, సెప్టెంబర్ 23: ఆస్ట్రేలియా, భారత్ జట్ల మధ్య వచ్చే ఆదివారం నాడు జరిగే టీ20 మ్యాచ్ టికెట్ల అమ్మకాల సమయంలో తొక్కిసలాట జరిగిన సంగతి తెలిసిందే. క్రీడాభిమానులంతా గుంపులు గుంపులుగా టికెట్ల కోసం ఎగబడటంతో జింఖానా వద్ద తీవ్రమైన తొక్కిసలాట జరిగింది. దీనిలో పలువురు అభిమానులు తీవ్రంగా గాయపడ్డారు. ఈ గొడవకు హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) కారణమంటూ కొందరు మండిపడుతున్నారు.అయితే తమకు ఈ తొక్కిసలాటతో అసలు ఎలాంటి సంబంధం లేదని హెచ్‌సీఏ ప్రెసిడెంట్ మహమ్మద్ అజారుద్దీన్ స్పష్టం చేశారు. టికెట్లు అమ్మే కాంట్రాక్ట్‌ను థర్డ్ పార్టీకి ఇచ్చామని, అలాంటప్పుడు టికెట్ల అమ్మకాల సమయంలో జరిగిన గొడవకు తమతో సంబంధం ఏంటని అజారుద్దీన్ ప్రశ్నించారు. స్టేడియం వద్ద జరిగింది చాలా దుర్ఘటన అని చెప్పిన ఆయన.. దానికి తమను బాధ్యులు చేయడం సరికాదన్నారు.ప్రజలకు అందుబాటులో ఉన్న టికెట్ల సంఖ్య గురించి ప్రశ్నించగా.. 'సెప్టెంబరు 15న మొత్తం 11,450 టికెట్లు ఆన్‌లైన్‌లో అమ్మారు. ఆ తర్వాత కార్పొరేట్ బాక్స్ టికెట్లు 4000 అమ్మారు. తర్వాత ఆఫ్‌లైన్‌లో 3 వేల టికెట్లు అమ్మి, మళ్లీ ఆన్‌లైన్‌లో గురువారం నాడు 2100 టికెట్లు అమ్మకానికి పెట్టారు. ఇవికాక సుమారు 6వేల టికెట్లను స్టేక్‌హోల్డర్లు, అసోసియేషన్ భాగస్వాములకు అందజేశాం' అని లెక్కలు చెప్పారు. అయితే ఉప్పల్ స్టేడియం సామర్థ్యం 55 వేల సీట్లు కాగా, వీటిలో కనీసం 39 వేల టికెట్లను ప్రజలకు అందుబాటులో ఉంచాలి. కానీ అలా జరగకపోవడం గమనార్హం.

# ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ రాష్ట్రాలు/కేంద్రపాలిత ప్రాంతాల ప్రతినిధుల సమావేశాన్ని ప్రారంభించిన డాక్టర్ మన్సుఖ్ మాండవీయ

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 23: సేవా గుణం, సహకారం అనేవి మన సంస్కారంలో అంతర్భాగంగా ఉన్నాయి. సంస్కారం, సేవ, సహకారం స్ఫూర్తిగా తీసుకుని పనిచేస్తున్న ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ప్రజలకు అవసరమైన మరియు అత్యవసర సమయాల్లో సహాయం చేయడానికి, అండగా నిలుస్తున్నది' అని కేంద్ర ఆరోగ్య,కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ అధ్యక్షుడు డాక్టర్ మన్సుఖ్ మాండవీయ అన్నారు. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ రాష్ట్రాలు/కేంద్రపాలిత ప్రాంతాల ప్రతినిధుల సమావేశాన్ని డాక్టర్ మాండవీయ ఈ రోజు ఢిల్లీలో ప్రారంభించారు. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ పనితీరును మరింత మెరుగు పరిచేందుకు అనుసరించాల్సిన చర్యలను చర్చించి ఖరారు చేసేందుకు రెండు రోజుల ఆలోచనా శిబిరాన్ని నిర్వహిస్తున్నారు. సమావేశంలో రాష్ట్ర రెడ్ క్రాస్ సొసైటీ ల అధ్యక్షులు, ఉపాధ్యక్షులు,కార్యదర్శులు, ఇతర సభ్యులు పాల్గొంటున్నారు.

ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ పనితీరు పట్ల సంతృప్తి వ్యక్తం చేసిన డాక్టర్ మాండవీయ సంస్థను అభినందించారు.ఇండియన్ రెడ్ క్రాస్ ప్రజల విశ్వసనీయతను పొందిందని అన్నారు. అవసరమైన సమయంలో ప్రజలు సంస్థను ఆశాకిరణంగా చూస్తూ సహాయం పొందుతున్నారని డాక్టర్ మాండవీయ పేర్కొన్నారు. అయితే, ఉనికి, విశ్వసనీయతను కొనసాగించేందుకు మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా ఇండియన్ రెడ్ క్రాస్ మారక తప్పదని డాక్టర్ మాండవీయ స్పష్టం చేశారు.

'తన బలాలు, బలహీనతలను బేరీజు వేసుకుని మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా పనితీరును మెరుగు పరుచుకోవడానికి సంస్థ కృషి చేయాలి.దీనికోసం సంస్థ నిర్మాణాత్మక మరియు సంస్థాగత వ్యవస్థలో మార్పు తీసుకు రావాల్సి ఉంటుంది.ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ప్రాంతీయ కేంద్రాల పనితీరు మెరుగుపరిచేందుకు, పారదర్శక విధానంలో నియామకాలు జరిగేలా చూసి, సమస్యల పరిష్కారానికి పటిష్ట విధానాన్ని అమలు చేయడానికి చర్యలు అమలు జరగాలి.

ప్రజలకు అవసరమైన సేవలు అందించేందుకు డిజిటల్ సాంకేతిక అంశాలను మరింత ఎక్కువగా ఉపయోగించాల్సి ఉంటుంది." అని ఆయన పేర్కొన్నారు.

కోవిడ్ మహమ్మారి సమయంలో దేశంలో ఆరోగ్య పరిరక్షణ రంగంలో చోటుచేసుకున్న మార్పులను డాక్టర్ మాండవీయ వివరించారు. ' ఇతర దేశాల్లో అమలు జరుగుతున్న ఆరోగ్య సంరక్షణ విధానాలు గతంలో దేశానికి ఆకర్షణీయంగా ఉండేవి. అయితే, కోవిడ్ మహమ్మారి మన ఆరోగ్య సంరక్షణ బలాన్ని తెలియజేసింది. అభివృద్ధి చెందిన దేశాలతో సహా ఇతర దేశాల ఆరోగ్య సంరక్షణ బలహీనతలను వెల్లడించింది. ప్రాంతీయ నమూనాల సహాయంతో కోవిడ్ పరిస్థితిని పటిష్టంగా ఎదుర్కొని విజయం సాధించిన భారతదేశం వ్యాక్సిన్ మైత్రి ద్వారా ఇతర దేశాలకు టీకాలు సరఫరా చేసింది. దేశంలో అభివృద్ధి చేసిన ఔషధాలు నాణ్యతతో రాజీ పడకుండా ఆశించిన ఫలితాలు అందించాయి. ఎక్కువ ధరలతో ప్రజలు దోపిడీకి గురి కాలేదు. వసుధైక కుటుంబం అన్న భావనతో పనిచేసి విజయం సాధించాము.' అని డాక్టర్ మాండవీయ వివరించారు.

ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ కార్యక్రమాలను విస్తృతం చేయడానికి, ఇతర వినూత్న కార్యక్రమాలు చేపట్టేందుకు సలహాలు, సూచనలు ఇవ్వాలని సమావేశానికి హాజరైన వారిని డాక్టర్ మాండవీయ కోరారు.

# షీ ఈజ్ - ఉమెన్ ఇన్ స్టీమ్ పుస్తకాన్ని ఆవిష్కరించిన భారత ప్రభుత్వ ప్రధాన శాస్త్రీయ సలహాదారు, బ్రిటీష్ హైకమిషనర్



న్యూఢిల్లీ, సెప్టెంబర్ 23: భారత ప్రభుత్వ ప్రధాన శాస్త్రీయ సలహాదారు ప్రొఫెసర్ అజయ్ సూద్, బ్రిటిష్ హైకమిషనర్ అలెక్స్ ఎల్లిస్ 2022 సెప్టెంబర్ 21న ఎల్సా మేరీ డిసిల్వా, సుప్రీత్ కె సింగ్ రచించిన " షీ ఈజ్–ఉమెన్ ఇన్ స్టీమ్" అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు.

భారతదేశ 75 ఏళ్ల స్వాతంత్ర్యాన్ని పురస్కరించుకొని స్టీమ్ (సైన్స్, టెక్నాలజీ, ఇంజనీరింగ్, ఆర్ట్స్ ,మ్యాథమెటిక్స్ రంగాలు ) లో మహిళా నాయకత్వం, సుస్థిర అభివృద్ధిని జరుపుకునేలా 75 మంది మహిళల విజయపథ ప్రయాణ ఘట్టాలను ఈ పుస్తకం వివరించింది,

ధైర్య0, ఆశ , సంకల్పం వ0టి వాటి గురి0చిన వ్యక్తిగత కథలను వివరిస్తూ, ఈ పుస్తక0, అంత సులభ0 కాని , మహిళల వ్యక్తిగత, వృత్తిపరమైన పోరాటాల గురించి మాట్లాడుతుంది, అయితే ఈ విభాగాలలో ఏదో ఒకదానిలో పని చేయాలనుకునే ప్రతి అమ్మాయికి ఖచ్చితంగా స్ఫూర్తిదాయకంగా బీ ఉంటుంది.

భారత ప్రభుత్వ ప్రధాన శాస్త్రీయ సలహాదారు కార్యాలయం, ఫిక్కీ ఎఫ్.ఎల్.ఓ, బ్రిటిష్ హైకమిషన్ ఆఫ్ ఇండియా మద్దతుతో కూడిన ఈ పుస్తకం లిఖిత పూర్వక రూపంలోనే కాకుండా, క్యూఆర్ కోడ్ ద్వారా ప్రాప్తి చేయగల సాధకులందరి వీడియోలను కూడా కలిగి ఉంది.

"కార్పొరేట్ , అభివృద్ధి రంగంలో సంవత్సరాలుగా మన కృషిలో, పితృస్వామ్యం వివిధ విషయాలపై అన్ని–పురుష ప్యానెల్స్ లేదా 'మానెల్స్' రూపంలో ప్రదర్శించబడింది, మహిళలను ప్రత్యక్షంగా,పరోక్షంగా ప్రభావితం చేసే నిర్ణయాలు తీసుకోవడం, మహిళల సహకారం ,స్వరాలను నిర్దాక్షిణ్యంగా విస్మరించడం చూశాము. లింగ సమాన ప్రపంచాన్ని సృష్టించడంలో మహిళలు, పురుషులు ఇతర లింగాలతో కలిసి పనిచేస్తున్నప్పుడు, మహిళా సాధకుల కథలను ముందుకు తీసుకురావాలని నిర్ణయించుకున్నాము. ఈ పుస్తకం స్టీమ్ రంగాలలోని మహిళలను మరింత కనిపించేలా చేయడానికి ప్రయత్నిస్తుంది, వారి గణనీయమైన సహకారాన్ని జరుపుకుంటుంది, ఇంకా తరచుగా జెండర్ తో కూడిన సవాళ్లతో నిండిన వారి ప్రయాణాలను గుర్తించడానికి ప్రయత్నిస్తుంది.

భారతదేశ స్వాతంత్ర్యానికి మహిళల సహకారం, తదనంతర విజయం ,పురోగతి, తక్కువ అంచనా వేయబడ్డాయి. మేము దానిని సరిదిద్దాలనుకుంటున్నాము" అని రచయితలు, ఎల్సా మేరీ డిసిల్వా ,సుప్రీత్ కె సింగ్ చెప్పారు

"ఈ సంవత్సరం ఐఐటి ఢిల్లీ డైమండ్ జూబ్లీ వేడుకలో గౌరవ భారత రాష్ట్రపతి, భారతదేశాన్ని ఆత్మనిర్భర్ ఐణగా రూపొందించడంలో భారతదేశ యువతుల సహకారం అత్యంత కీలకమైనదిగా ఉండబోతోందని పేర్కొన్నారు. ఈ మార్గాల్లోనే ప్రభుత్వం, తన వివిధ విధానాల ద్వారా, ప్రధాన ప్రవంతికి నూతన ప్రేరణను అందిస్తోంది, ఎస్ టి ఐ పర్యావరణ వ్యవస్థలో ఈక్విటీ , చేరికను సంస్థాగతం చేస్తోంది. వీటిలో 5వ సైన్స్, టెక్నాలజీ, ఇన్నోవేషన్ పాలసీ ఒకటి. ఈ విధానాన్ని మన ఇన్స్టిట్యూట్లు ఎలా తగినంతగా అమలు చేయవచ్చో మనమందరం ఆలోచించాల్సిన అవసరం ఉంది, తద్వారా సైన్స్ లో యువతులు ,మహిళలు మరింత సమానమైన అవకాశాలను ,ప్రదర్శనకు స్వాగతించే ప్రదేశాలను పొందుతారు " అని ఆవిష్కరణ సందర్భంగా భారత ప్రభుత్వ ప్రధాన శాస్త్రీయ సలహాదారు ప్రొఫెసర్ అజయ్ సూద్ అన్నారు. దేశ వ్యాప్తంగా ప నిచేస్తున్న వివిధ రంగాలకు చెందిన మహిళల కథలతో షీ ఈజ్ బుక్ ను విడుదల చేసినందుకు బ్రిటీష్ హై కమిషన్ ,రెడ్ డాట్ ఫౌండేషన్ ల ప్రయత్నాలను ఆయన అభినందించారు.

"మహిళలు, యువతులతో సహా ప్రతి ఒక్కరికీ అవకాశాలు కల్పించడం వల్ల ప్రతి దేశం మరింత బలంగా, తెలివైనదిగా మారుతుంది. అందుకే బ్రిటీష్ ప్రభుత్వం 300 మందికి పైగా యువ భారతీయ మహిళా శాస్త్రవేత్తలు, ఆవిష్కర్తలకు వారి సామర్థ్యాన్ని చేరుకోవడానికి మద్దతు ఇచ్చింది. అయితే, తిని

ఇంకా చాలా దూరం వెళ్ళవలసి ఉంది, ఈ పుస్తకంలోని ఉదాహరణలు తరువాతి తరం మహిళా నాయకులకు ప్రేరణ కలిగిస్తాయని నేను ఆశిస్తున్నాను, అందుకే మేము ఈ పనిలో భారత ప్రభుత్వం ,రెడ్ డాట్ ఫౌండేషన్ తో భాగస్వామ్యం నెరపుతున్నాము." అని బ్రిటిష్ హైకమిషనర్ అలెక్స్ ఎల్లిస్ అన్నారు.

మహిళలకు సమానత్వం అందరికీ పురోభివృద్ధి. ఈ రంగాలలో ప్రవేశించడానికి, ప్రయోజనం పొందడానికి, అభివృద్ధి చేయడానికి ,ప్రభావితం చేయడానికి మహిళల సామర్థ్యం అపారమైనది. మా సహకార ప్రయత్నానికి రెండు లక్ష్యాలు ఉన్నాయి, ఒకటి వేడుకలు జరుపుకోవడం, రోల్ మోడల్స్ ను సృష్టించడం ,రెండవది దేశం సమ్మిళిత ,స్థిరమైన వృద్ధిని సాధించడానికి ఈ రంగం సామర్థ్యాన్ని ఉపయోగించుకోవడం " అని ఎఫ్ఎల్ఓ అధ్యక్షుడు జయంతి దాల్మియా అన్నారు.ప్రచురణకర్త, బియాండ్ బ్లాక్, కళ, పుస్తకాలు, కవిత్వం, చలనచిత్రాలు మరియు సంఘటనలను ఉపయోగించి వైవిధ్యం ,సమ్మిళితతను ప్రోత్సహించడానికి పని చేస్తున్న ఒక సామాజిక సంస్థ.

పుస్తకావిష్కరణ కార్యక్రమంలో పిఎస్ఎ, బ్రిటిష్ హైకమిషనర్, ప్రెసిడెంట్, ఫిక్కీ ఎఫ్లో, స్ట్రాటజిక్ అలయన్స్ డివిజన్, ఆఫీస్ ఆఫ్ పిఎస్ఎ రచయితలు పాల్గొన్నారు.

# బతుకమ్మ పండుగ ఏర్పాట్లపై కలెక్టర్ సమావేశం



ఖమ్మం, సెప్టెంబర్ 23: (నేటినిజం ప్రతినిధి): ఈనెల 25 నుండి ఎంగిలిపూల బతుకమ్మ తో ప్రారంభమై, అక్టోబర్ 3న జరుగు సద్దుల బతుకమ్మ వరకు పండుగను ఘనంగా నిర్వహించేలా ఏర్పాట్లు ఉండాలని జిల్లా కలెక్టర్ వి.పి. గౌతమ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ లోని ప్రజ్ఞ సమావేశ మందిరంలో బతుకమ్మ పండుగ ఏర్పాట్లపై కలెక్టర్ సమావేశాన్ని నిర్వహించి అధికారులకు ఏర్పాట్లపై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతీకగా నిలిచి ఎంగిలిపూల బతుకమ్మతో ప్రారంభమై, సద్దుల బతుకమ్మ వరకు తొమ్మిది రోజుల పాటు నిర్వహించనున్న బతుకమ్మ పండుగ ఏర్పాట్లు జిల్లాలో ఎటువంటి లోటుపాట్లు లేకుండా ఘనంగా నిర్వహించాలని అన్నారు. గత రెండు సంవత్సరాలుగా కోవిడ్ కారణంగా వేడుకలు చేపట్టలేదని, ఈ సారి పెద్ద ఎత్తున చేపట్టాలని అన్నారు. ఒక్కో రోజు ఒక్కో శాఖ క్రియాశీలకంగా వేడుకలు నిర్వహించాలన్నారు. రెస్టారెంట్లతో తెలంగాణా వంటకాలకు సంబంధించి ఫుడ్ ఫెస్టివల్ ఏర్పాటుకు చర్యలు చేపట్టాలన్నారు. మీడియన్స్, ప్రధాన కూడళ్లలో బతుకమ్మకు సంబంధించి సుందరీకరణ చేయాలన్నారు. జిల్లా ప్రధాన ఆసుపత్రి, సామాజిక ఆరోగ్య కేంద్రాలు, ప్రయివేటు ఆసుపత్రుల్లో ప్రసవాలు జరిగి అమ్మాయి పుట్టినవారికి చీరెలు అందించి సత్కరించాలని, ఆడపిల్లలను ప్రోత్సహించాలని, ఒక పండుగలా వేడుక చేయాలని ఆయన అన్నారు. ఆడపిల్లల సంరక్షణపై దృష్టి పెట్టాలని అన్నారు. ఫోటోగ్రఫీ, పెయింటింగ్ లలో పోటీలు నిర్వహించాలని ఆయన తెలిపారు. నిమజ్జనం చేసే ప్రాంతాలలో లైటింగ్, సీసీకెమెరాలను ఏర్పాటుచేయాలన్నారు. లోతు ఎక్కువగా వున్న ప్రదేశాల్లో గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచాలని అన్నారు. సానిటేషన్ ఏర్పాట్లు సక్రమంగా ఉండేలా చూడాలని అధికారులను ఆదేశించారు. బతుకమ్మ చీరెల పంపిణీ ఈ నెల 25 లోగా పూర్తయ్యేలా చర్యలు చేపట్టాలన్నారు. రేషన్ కార్డులోని 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్క మహిళకు చీరెలు అందాలని ఆయన అన్నారు.

సమావేశంలో పాల్గొన్న పోలీస్ కమిషనర్ విష్ణు ఎస్. వారియర్ మాట్లాడుతూ, పెద్ద సంఖ్యలో మహిళలు ఉన్నచోట లైటింగ్ ఏర్పాటు చేయాలని అన్నారు. విలువైన వస్తువులు, ఈవ్ టీజింగ్ జరగకుండా భద్రతా చర్యలు చేపట్టాలన్నారు.

ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు స్నేహాలత మొగిలి, ఎన్. మధుసూదన్, మునిసిపల్ కమీషనర్ ఆదర్శ్ సురభి, సిఇ ఇరిగేషన్ శంకర్ నాయక్, డిఆర్డీవో విద్యాచందన, జిల్లా వ్యవసాయ అధికారిణి విజయనిర్మల, జిల్లా ఉద్యానవన అధికారిణి అనసూయ, జిల్లా పంచాయతీ అధికారి హరిప్రసాద్, జిల్లా సంక్షేమ అధికారిణి సంధ్యారాణి, జిల్లా గిరిజన సంక్షేమ అధికారి కృష్ణా నాయక్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# అడవులు సంరక్షణ, పునర్జీవనానికి శాశ్వత ప్రాతిపదికన పరిష్కారం

మెదక్, సెప్టెంబర్ 23 : నేటినిజం (ప్రతినిధి):ఎన్నో ఏళ్లుగా పోడు భూములను సాగు చేస్తూ అటవీ హక్కు పత్రాలు పొందని గిరిజన, గిరిజనేతరులకు న్యాయం కల్పించడంతో పాటు అడవులు సంరక్షణ, పునర్జీవనానికి శాశ్వత ప్రాతిపదికన పరిష్కారం కొరకు ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తున్నదని రాష్ట్ర ఆర్థిక, వైద్య ఆరోగ్య శాఖామంత్రి తన్నీరు హరీష్ రావు అన్నారు. గురువారం కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ ఏర్పాటు చేసిన జిల్లా సమన్వయ కమిటీ సమావేశంలో మాట్లాడుతూ జిల్లాలో 85 గ్రామాలలో 7,740 ఎకరాలకు సంబంధించి 4,503 క్లెయిమ్ లు స్వీకరించి ఆన్ లైన్ లో పొందుపరిచామని అన్నారు. కాగా 85 గ్రామ పంచాయితీలలోని 140 హాబిటేషన్ లలో 4,606 ఎకరాలకు సంబంధించి 2,776 క్లెయిమ్ లు సకాలంలో వచ్చిన ఆన్ లైన్ గ్రామ వివరాలు కనిపించక పొందుపరచలేకపోయారని అన్నారు. ఇందుకు సంబంధించి సమగ్ర వివరాలు మండలాల వారీగా ఏం.పి.డి.ఓ.లకు అందించవలసినదిగా అటవీశాఖాధికారికి సూచించారు. రెవిన్యూ, పంచాయత్ రాజ్, అటవీశాఖలు సమన్వయం చేసుకుంటూ ఏం.పి .డి.ఓ.లు గ్రామా స్థాయిలో సమావేశాలు ఏర్పాటు చేసుకొని 2005 కంటే ముందు నుండి అన్యాక్రాంతంగా పోడు భూములు సాగు చేస్తున్న గిరిజనులను, మూడు తరాలు అనగా 75 సంవత్సరాలనుండి పోడు భూములను సాగుచేస్తున్న గిరిజనేతరులకు సంబంధించిన క్లెయిమ్ లను గ్రామ స్థాయి కమిటీలో క్లెయిమ్ దారు సమక్షంలో క్షేత్ర స్థాయిలో సర్వే చేపట్టాలని, ఆయా స్థాయి కమిటీలో తీర్మానాలను, రిజిస్టర్లను పక్కాగా నమోదు చేయాలన్నారు. అటవీ భూములలో పోడు వ్యవసాయం ఎప్పటి నుండి జరుగుతుందన్న విషయాన్ని శాస్త్రీయంగా నిర్ధారించేందుకు శాటిలైట్ మ్యాపుల ప్రకారం సాంకేతికతతో జి.పి .ఎస్. సిస్టం ద్వారా డిజిటల్ సర్వే చేసి సరిహద్దులు నిర్ణయించి పక్కాగా ఆన్ లైన్ లో వివరాలు నమోదు చేయాలని సూచించారు. భూమే జీవనాధారంగా బ్రతుకుతున్న వాళ్లకు పట్టాలిచ్చి గట్టుకు చేర్చడమే ప్రభుత్వ లక్ష్యమని, తద్వారా వారికి రైతు బంధు, రైతు భీమా వంటి పథకాలు అందుతాయని అన్నారు. కాబట్టి మండల పరిషద్ అధికారులు ఫారెస్ట్ రేంజ్ అధికారులతో టై–అప్ చేసుకొని నిర్దేశించిన ప్రొఫార్మా ప్రకారం డిజిటల్ సర్వే నిర్వహించి, గ్రామాల నుండి తీర్మానాలు పంపాలని సూచించారు. పోడు భూములు సాగు చేస్తున్న నిజమైన గిరిజన, గిరిజనేతరులకు ఆర్.ఓ.ఎఫ్.ఆర్. పట్టాలు అందించడంతో పాటు, ఇకముందు అటవీ భూములు ఆక్రమణలు జరుగకుండా, వాటి పునర్జీవనానికి అటవీ రక్షణ చట్టం అమలుపై ప్రజలకు అవగాహన కలిగించాలన్నారు. అడవులు క్షీణించడం వల్ల మానవమనుగడకే ప్రమాదం పొంచివుంది కాబట్టి భవిష్యత్తులో ఒక్క అంగుళం అటవీ ప్రాంతం కూడా అన్యాక్రాంతం చేయమని ప్రజలలో అవగాహన కలిగించాలని, ప్రభుత్వం కూడా ఈ విషయంలో కఠినంగా వ్యవహరిస్తుందని తెలపాలని అన్నారు. బాధ్యాతాయుతమైన అధికారులుగా త్వరగా పోడు భూములను సర్వే చేసి గిరిజన, గిరిజనేతరులకు న్యాయం చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్.పి. చైర్ పర్సన్ హేమలత శేఖర్ గౌడ్ మెదక్,నరసాపూర్ ఎమ్మెల్యేలు పద్మా దేవేందర్ రెడ్డి, మదన్ రెడ్డి, ఎమ్మెల్సీ శేరి సుభాష్ రెడ్డి, జిల్లా కలెక్టర్ హరీష్, ఆస్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ప్రతిమ సింగ్, అదనపు ఎస్పీ బాలస్వామి, డిఎస్పీలు, జిల్లా పరిషద్ సీఈఓ శైలేష్, డిఆర్ డివో శ్రీనివాస్, డి.ఎఫ్.ఓ. రవి ప్రసాద్, ఆర్.డి.ఓ. సాయి రామ్, జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి కేశూరం, ఏం.పి .డి.ఓ.లు తదితరులు పాల్గొన్నారు.

# దేశానికే ఆదర్శం ముక్రా(కే) .. మహాజన్

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 23: దేశంలోని పల్లెలకు రాష్ట్రంలోని ఆదిలాబాద్ జిల్లా ముక్రా(కే) గ్రామ పంచాయతీ ఆదర్శంగా నిలుస్తున్నదని కేంద్ర జలశక్తి శాఖ కార్యదర్శి వినీ మహాజన్ ప్రశంసించారు. మహారాష్ట్రలోని పుణెలో ప్రారంభమైన రెండ్రోజుల జాతీయస్థాయి పంచాయతీరాజ్ సమ్మేళనానికి రాష్ట్రం నుంచి ముక్రా (కే) ను ఎంపిక చేయగా.. సర్పంచ్ మీనాక్షీ గాడ్గే హాజరయ్యారు. పల్లెప్రగతిలో భాగంగా చెత్త నుంచి సేంద్రియ ఎరువును తయారు చేసి ఆదాయం గడిస్తున్నట్లు సర్పంచ్ తెలిపారు. పంచాయతీలు ఆదాయం సమకూర్చుకొని అభివృద్ధి పనులు చేపట్టడం ప్రశంసనీయమని మహాజన్ అన్నారు. వివిధ రంగాల్లో ప్రగతి సాధించిన సర్పంచ్‌కు అవార్డు అందజేశారు.

# రెండు ద్విచక్ర వాహనాలు ఢీ.. ఇద్దరు మృతి



భూపాలపల్లి, సెప్టెంబర్ 23: జయశంకర్ భూపాలపల్లి జిల్లా భూపాలపల్లి మండలం మోరంచపల్లి– ఎస్ఎం కొత్తపల్లి గ్రామాల మధ్య శుక్రవారం రెండు బైకులు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ఘటనలో ఇద్దరు అక్కడికక్కడే మృతిచెందారు. మరో ముగ్గురికి తీవ్ర గాయాలు కాగా.. వారిని 108లో ఆస్పత్రికి తరలించారు. ఈ ప్రమాదంలో మొగుళ్లపల్లి మండలం పోతుగల్లు గ్రామానికి చెందిన మనోహర్, చిట్యాల మండలం నైన్ పాక గ్రామానికి చెందిన సతీష్ గా భావిస్తున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. ప్రమాదస్థలానికి భూపాలపల్లి పోలీసులు చేరుకొని వివరాలు సేకరిస్తున్నారు.

# విద్యార్థినికి గోరుముద్దలు తినిపించిన మంత్రి శ్రీనివాస్ గౌడ్

మహబూబ్‌నగర్, సెప్టెంబర్ 23: గ్రామీణ మండలం కోటకదిర జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో అక్షయపాత్ర ద్వారా మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రారంభించిన తర్వాత విద్యార్థులతో కలిసి మంత్రి శ్రీనివాస్ గౌడ్ సహపంక్తి భోజనం చేశారు.ఈ క్రమంలో శివాని అనే తొమ్మిదో తరగతి విద్యార్థినికి మంత్రి గోరుముద్దలు తినిపించారు.ఈ సందర్భంగా మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రారంభించినందుకు శివాని.. మంత్రికి కృతజ్ఞతలు తెలిపింది.విద్యార్థిని చురుగ్గా, ధైర్యంగా మాట్లాడటం గమనించిన మంత్రి గోరు ముద్దులు తినిపించి చక్కగా చదువుకొని డాక్టర్ అవ్వాలన్నారు. కష్టపడి చదివితే అన్ని విధాలా అండగా ఉంటామని ఆశీర్వదించారు.



